ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి
"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.
అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.
- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక
సంపుటి: 6 సంచిక: 86, పేజీలు - 08
శుక్రవారం, సెప్టెంబర్ 25, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




# ఖైరతాబాద్‌కి ఉపఎన్నికనే!

## - దానం నాగేందర్‌కు అనర్హత వేటు ఖరారు

- అనర్హత వేటును సమర్థించిన సుప్రీంకోర్టు
- ఉపఎన్నికలో పోటీ చేసుకోవాలని సూచన
- పదవితో పాటు పార్టీ మారితే ఫిరాయింపేనని స్పష్టీకరణ
- సుప్రీం తీర్పు పట్ల బీఆర్ఎస్, బీజేపీ హర్షం



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద తనపై తెలంగాణ హైకోర్టు విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను నిర్ద్వంద్వంగా కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థిస్తూ ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందని, అక్కడ ఉపఎన్నికలకు వెళ్లాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీని రంగంలోకి దించినప్పటికీ, దానం నాగేందర్‌కు ఎలాంటి ఉపశమనం లభించలేదు. విచారణ సమయంలో ధర్మాసనం , లాయర్ రోహత్గీ మధ్య ఆసక్తికరమైన వాదనలు జరిగాయి. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనలను ప్రస్తావిస్తూ స్పీకర్ గతంలో ఇచ్చిన ఆర్డర్ శైలిపై జస్టిస్ బాగ్చి తీవ్ర వ్యంగ్యాస్త్రాలు విసిరారు. దీనిపై రోహత్గీ వాదిస్తూ

2లో..

# జ్ఞానేశ్ కుమార్ తక్షణమే దిగిపోవాలి

## - ఢిల్లీలో రాహుల్ గాంధీ ప్రెస్ మీట్

- మోదీ, అమిత్ షాలు 'ఓట్ల దొంగతనం' చేస్తున్నారని సంచలన ఆరోపణ
- సీఈసీ వెంటనే రాజీనామా చేసి, అప్రూవర్‌గా మారాలని డిమాండ్
- ఈసీలో అంతర్గత విభేదాల వార్తల నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో ప్రస్తుతం ఓట్ల చోరీ నుంచి చట్టాల చోరీ చేసే వరకూ పరిస్థితి దిగజారిందని విపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. తమకు నచ్చిన ఎన్నికల కమిషనర్లను నియమించుకునేందుకు కేంద్రం పార్లమెంట్ లో నల్ల చట్టాలు చేసిందని, వాటి ద్వారా సీఈసీ అయిన జ్ఞానేష్ కుమార్ ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని రాహుల్ విమర్శించారు. ఎస్ఐఆర్ సహా తాజాగా బయటపడిన అక్రమాలకు కారణమైన జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ

2లో..




### 2030 కల్లా జీరో పావర్టీ రాష్ట్రంగా

# తెలంగాణ

## - డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచనుంది. రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఆర్థిక, ప్రణాళిక శాఖల కార్యదర్శులతో పాటు పలువురు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, హైదరాబాద్‌కు చెందిన జీఎఫ్ఎస్టీ వైస్ చైర్మన్ ఎస్.పీ. టక్కర్‌తో పాటు జీఎఫ్ఎస్టీ ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, అమలు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, అభివృద్ధి ఫలితాలను నిరంతరం పర్యవేక్షించేలా వ్యవస్థలను రూపొందించడంపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.

2లో..

## 22ఏ పరిధిలో ఉన్నా రిజిస్ట్రేషన్లు అమలు

- నిషేధిత భూములపై సర్కార్ శుభవార్త

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలోని వేలాది మంది ఆస్తిదారులు, ప్లాట్లు, ఫ్లాట్ల కొనుగోలుదారులకు రాష్ట్ర ప్రభుత్వం భారీ శుభవార్త చెప్పింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ), డైరెక్టరేట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) వంటి చట్టబద్ధమైన ప్లానింగ్ అథారిటీల నుంచి అనుమతులు

2లో..

### ప్రాణనష్టం జరగకుండా

# ముందస్తు చర్యలు తీసుకోండి

## - కలెక్టర్లకు సీఎం చంద్రబాబు ఆదేశాలు

- వర్షాలు కొనసాగుతాయని అంచనాల నడుమ సీఎం చంద్రబాబు సమీక్ష
- భారీ వర్షాల నేపథ్యంలో జలాశయాలన్నీ నింపాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- గోదావరి, కృష్ణా బేసిన్లలో పలుచోట్ల వరద హెచ్చరికలు జారీ చేసే అవకాశం
- ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టాలని సూచన

అమరావతి (ప్రశ్న న్యూస్) వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరుల్ని కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సీఎం చర్చించారు. తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో

2లో..




# బలమైన అభ్యర్థులను బరిలోకి దించాలి

## - స్థానిక సంస్థలపై ఎన్నికలపై కో ఆర్డినేటర్లకు జగన్ దిశానిర్దేశం

- స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు పూర్తిగా సిద్ధం కావాలన్న జగన్
- ఎన్నికలపై పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం
- ప్రజాదరణ కలిగిన మంచి అభ్యర్థులను గుర్తించాలని ఆదేశం

అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు గెలుపొందడమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని

2లో..



## తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్

- తెలంగాణ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా దశరథ్

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీజేపీ తమ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలకు కొత్త సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, సంయుక్త ప్రధాన కార్యదర్శులను నియమించింది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు కూడా కొత్త బాధ్యులను కేటాయించింది. ఈ నియామకాలు తక్షణమే

2లో..

# రేవంత్ రెడ్డికి 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026' అవార్డు

## - 'ఆర్యదాన్ ముహమ్మద్' పురస్కారానికి ఎంపిక



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మరో ప్రతిష్టాత్మక పురస్కారం దక్కనుంది. కేరళకు చెందిన దివంగత సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఏర్పాటు చేసిన ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంపికయ్యారు. ఈ అవార్డును ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేస్తోంది. కేరళలోని నిలంబూరులో జరిగే కార్యక్రమంలో రేవంత్ రెడ్డికి ఈ పురస్కారాన్ని ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ప్రదానం చేయనుంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2లో..

### పనీర్ ముసుగులో

# కల్తీకి కళ్లెం



## - దేశవ్యాప్తంగా నిషేధానికి ఎఫ్ఎస్ఎస్ఏఐ ప్రతిపాదన

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పనీర్ పేరుతో విక్రయిస్తున్న నాన్-డెయిరీ ఉత్పత్తులపై కేంద్రం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. దేశవ్యాప్తంగా అనలాగ్ పనీర్ తయారీ, విక్రయాలను నిషేధించేలా ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదించింది. ఇందుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలను ప్రజల అభిప్రాయాల కోసం విడుదల చేసింది. ఎఫ్ఎస్ఎస్ఏఐ ముసాయిదా ప్రకారం పనీర్ స్వభావం, అందులో ఉపయోగించిన పదార్థాల విషయంలో వినియోగదారులు తప్పుదోవ పట్టకుండా ఈ మార్పులు తీసుకొస్తున్నారు. ప్రస్తుతం 'అనలాగ్ ఇన్ డెయిరీ కాంటెక్స్ట్' కేటగిరీలో లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ పొందిన ఉత్పత్తులు ఇకపై తమ పేరు, లేబుల్, మార్కెటింగ్‌లో 'పనీర్' అనే పదాన్ని ఉపయోగించకూడదు. ఈ నిబంధనలను ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ (ప్రొహిబిషన్ అండ్ రెస్ట్రిక్షన్స్ ఆన్ సేల్స్) రెగ్యులేషన్స్‌లో చేర్చాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్ణయించింది. ముసాయిదాపై అభిప్రాయాలను 60 రోజుల వ్యవధిలో స్వీకరించనున్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు అనలాగ్ పనీర్ తయారీ, విక్రయాలపై నిషేధం విధించాయి. మహారాష్ట్రలో ఇటీవల ఆర్టిఫిషియల్ అనలాగ్ పనీర్ తయారీ, పంపిణీ, విక్రయాలపై ఏడాది పాటు నిషేధం విధించారు. రాష్ట్రంలో ఇటీవల పరీక్షించిన పనీర్ నమూనాల్లో 35 శాతానికి పైగా నాణ్యత పరీక్షల్లో విఫలమయ్యాయి. కూరగాయల కొవ్వు కల్తీ ఉన్నట్లు పరీక్షల్లో తేలడంతో ఈ చర్య తీసుకున్నారు. గుజరాత్ ప్రభుత్వం కూడా నాన్-స్టాండర్డ్ అనలాగ్ పనీర్, చీజ్, వెన్న తయారీ, నిల్వ, రవాణా, పంపిణీ, విక్రయాలపై రాష్ట్రవ్యాప్తంగా నిషేధం ప్రకటించింది. కూరగాయల నూనెతో పాటు ఇతర డెయిరీయేతర పదార్థాలతో తయారు చేసిన ఉత్పత్తులను పనీర్‌గా విక్రయించడం వల్ల వినియోగదారులు మోసపోయే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీనివల్ల అసలైన పాల ఉత్పత్తుల తయారీదారులకు నష్టం కలగడంతో పాటు ఆహార భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి.

## రాహుల్, రేవంత్‌లకు "సుప్రీం చెంపపెట్టు"

### - దానం నాగేందర్ అనర్హతపై కేటీఆర్ స్పందన

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద తనపై అనర్హత వేటు వేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం గురువారం కొట్టివేసింది. ఈ విషయంలో జోక్యం చేసుకునేందుకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ తీర్పుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగిలిన "సుప్రీం చెంపపెట్టు" అని అభివర్ణించారు.

3లో..



## ప్రాణనష్టం జరగకుండా

# ముందస్తు చర్యలు తీసుకోండి

గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్ మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని అన్నారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటిని ఏలేరు రిజర్వాయర్ నింపాలని స్పష్టం చేశారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని పంపాలన్నారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

### గోదావరి, కృష్ణా, నాగావళి, వంశధార బేసిన్లపై ప్రత్యేక దృష్టి

ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులు--వాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఏలేరు రిజర్వాయర్‌కు 21,200--26,500 క్యూసెక్కుల మేర, తాండవకు 6,000--7,500 క్యూసెక్కులు, మేఘాద్రిగడ్డకు 2,400--3,000 క్యూసెక్కులు, పంపాకు 3,100--3,875 క్యూసెక్కులు వరకు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. నాగావళి--వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరగనున్నాయని వివరిచారు. గొట్టా బ్యారేజీకి సెప్టెంబర్ 25 ఉదయం నాటికి వార్నింగ్ లెవల్--1 చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు. భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్--1, అదే రోజు రాత్రికి వార్నింగ్ లెవల్--2 దాటే అవకాశం ఉందని తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం వార్నింగ్ లెవల్--1, సాయంత్రం వార్నింగ్ లెవల్--2 దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. శబరి నదిపై కుంటా వద్ద సెప్టెంబర్ 26 ఉదయానికి వార్నింగ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

### ప్రకృతి వ్యవసాయం చేయాలి.. భూసారాన్ని పెంచాలి

ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్‌గా అమలు చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు అందించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం సూచించారు. వ్యవసాయానికి సంబంధించిన సమాచారంతో పాటు సాగునీటి లభ్యత, రిజర్వాయర్ల పరిస్థితి తదితర వివరాల డేటా పొందుపరచాలని ఆదేశించారు. అక్టోబరు 2 తేదీన ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నామని, అదే రోజు రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. మైక్రోసాఫ్ట్ సహకారంతో రూపొందించిన ఏఐ స్టాక్ ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ డెమో ఇవ్వాలని సీఎం సూచించారు. భూగర్భజలాలు సహా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలపైనా అమెరికాలోని పృథ్వీ అనే యువకుడు రూపొందించిన యాప్ లను సీఎం పరిశీలించారు. వివిధ శాఖల నుంచి సేకరించిన డేటా సెట్లను సమన్వయం చేసుకుంటూ నాసా ఉపగ్రహ చిత్రాలను అనుసంధానం చేస్తూ ఈ యాప్ ను రూపొందించిన పృథ్విని సీఎం అభినందించారు. భూగర్భజలాల స్థాయిలు, వాటి మార్పులు, ప్రాంతాల వారీ పరిస్థితులను విశ్లేషించడం ద్వారా భవిష్యత్తులో నీటి నిర్వహణకు మెరుగైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

### శాప్ ద్వారా క్రీడా క్యాలండర్

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. విద్యుత్ టారిఫ్‌ను పెంచకపోయినా సేవల్లో లోపాల కారణంగా ప్రజల్లో సంతృప్తి తగ్గుతోందని, సరఫరా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. రాష్ట్రంలో 287.214 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉన్న నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి లభ్యతపైనా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఇసుక లభ్యత ధరలు, సరఫరాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. శాప్ ఆధ్వర్యంలో ఏడాది క్రీడా క్యాలెండర్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామస్థాయిలోనూ క్రీడా పోటీలు నిర్వహించాలని సూచించారు. 175 నియోజకవర్గాల్లో క్షేత్రస్థాయిలో సిబ్బంది పనితీరును మెరుగుపరిచేలా స్పష్టమైన సూచనలు ఇవ్వాలని సీఎం ఆదేశించారు. నోడల్ అధికారుల ఆధ్వర్యంలో నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించి పనితీరులో మార్పు తీసుకురావాలని ఆదేశించారు. గృహనిర్మాణంలో జీరామ్‌జీ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన పనులు చేపట్టాలని సీఎం సూచించారు. డేటా ఆధారిత పాలనలో భాగంగా ప్రభుత్వ శాఖల్లో ఏఐ లివింగ్ ల్యాబ్స్ యాప్‌ల వినియోగం, సమాచార విశ్లేషణను మరింత విస్తరించాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

# 2030 కల్లా జీరో పావర్టీ రాష్ట్రంగా తెలంగాణ

### టీఎస్డీపీఎస్ కు ప్రత్యేక పీఎంయూ

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘం (టీఎస్డీపీఎస్)ను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను పీఎంయూ నిర్వహించనుంది.

### 2030 నాటికి 'జీరో పావర్టీ'

2030 నాటికి తెలంగాణను 'జీరో పావర్టీ' రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక, లక్ష్యిత కార్యక్రమాలను అమలు చేయనున్నారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి, వారికి అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంతో పాటు స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టనున్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల ఫలితాలను కొలిచేందుకు, పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

### 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ

తెలంగాణను 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన, కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాన్ని రూపొందించనున్నారు. రాష్ట్రంలోని బలాలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవడంతో పాటు పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, సమ్మిళిత అభివృద్ధికి కొత్త అవకాశాలను అందిపుచ్చుకునేలా కార్యాచరణ రూపొందించనున్నారు.

### రంగాల వారీ నిపుణుల సేవలు

రాష్ట్ర ప్రభుత్వ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన నిపుణులు, కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోవాలని నిర్ణయించారు. ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, వ్యూహాత్మక సహకారాన్ని నిపుణుల ద్వారా పొందనున్నారు.

### ప్రభుత్వం- జీఎఫ్ఎస్టీ భాగస్వామ్యం

వ్యూహాత్మక ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నాలెడ్జ్ సపోర్ట్, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, కీలక అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు తెలంగాణ ప్రభుత్వం- జీఎఫ్ఎస్టీ మధ్య అవగాహన ఒప్పందం కుదుర్చుకునే ప్రతిపాదనను సిద్ధం చేయాలని నిర్ణయించారు.

### జిల్లాల వారీగా అభివృద్ధి ప్రణాళికలు

రాష్ట్ర స్థాయి అభివృద్ధి లక్ష్యాలను జిల్లాల స్థాయిలో కొలిచే వీలున్న ఫలితాలుగా మార్చేందుకు సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ఈ ప్రణాళికలకు డేటా ఆధారిత డ్యాష్‌బోర్డులు, స్పష్టమైన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్, కొలిచే వీలున్న ఫలితాలు, బడ్జెట్ అనుసంధానం ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. దీంతో జిల్లాల అభివృద్ధి పురోగతిని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు లోటుపాట్లను గుర్తించి, అవసరమైన చోట సకాలంలో దిద్దుబాటు చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

### ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్

ప్రభుత్వ శాఖలు, రంగాల నిపుణులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అభివృద్ధి సంస్థలు, ఇతర కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయనున్నారు.

ఈ గ్రోత్ ల్యాబ్స్‌లో ప్రధానంగా పేదరిక నిర్మూలన, మౌలిక వసతులు--లాజిస్టిక్స్, ఆరోగ్యం, పర్యాటకం, పశుసంపద--ఆక్వాకల్చర్, పట్టణీకరణ, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ అంశాలపై దృష్టి సారించనున్నారు. అభివృద్ధి అవకాశాలను గుర్తించడం, అమలులో ఉన్న అవరోధాలను పరిష్కరించడం, రంగాల వారీ వ్యూహాలను రూపొందించడం, ప్రాధాన్యతలను కాలపరిమితితో కూడిన, కొలిచే వీలున్న కార్యాచరణ ప్రణాళికలుగా మార్చడం గ్రోత్ ల్యాబ్స్ ప్రధాన ఉద్దేశంగా ఉంటుంది.

### ఫలితాల ఆధారంగా అభివృద్ధి

టీఎస్డీపీఎస్ - పీఎంయూ బలోపేతం, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు, ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్, రంగాల నిపుణుల సేవలు, ప్రభుత్వం- జీఎఫ్ఎస్టీ భాగస్వామ్యం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర సంస్థాగత వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. డేటా ఆధారిత నిర్ణయాలు, ఫలితాలపై దృష్టి, మిషన్ మోడ్‌లో అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ఈ వ్యవస్థ దోహదపడనుంది. 2030 నాటికి పేదరిక నిర్మూలన, 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలను వేగంగా సాధించేందుకు రాష్ట్ర అభివృద్ధి దార్శనికతను కార్యాచరణలోకి తీసుకురావడమే ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశమని సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డికి

## 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026' అవార్డు

ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, ఆయన నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ప్రకారం.. తెలంగాణలో ప్రజా సంక్షేమానికి ఉద్దేశించిన కార్యక్రమాలతో పాటు రేవంత్ రెడ్డి నాయకత్వంలో కనిపించిన విధానాలను అవార్డు ఎంపిక కమిటీ పరిగణనలోకి తీసుకుంది. ప్రజాస్వామిక విలువల పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను కూడా జ్యూరీ ప్రస్తావించింది. ఇవన్నీ ఫౌండేషన్ ప్రకటించిన అవార్డు ఎంపిక కారణాలు అని తెలిపింది.ఆర్యదాన్ ముహమ్మద్-2026 పురస్కారానికి రేవంత్ రెడ్డిని ఎంపిక చేసిన జ్యూరీలో ముగ్గురు ప్రముఖులు ఉన్నారు. కాంగ్రెస్ ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఏపీ అనిల్ కుమార్ ప్రముఖ రచయిత, మేధావి కల్పెట్ట నారాయణన్ ఈ జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు. జ్యూరీ పరిశీలన అనంతరం రేవంత్ రెడ్డిని 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026' అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ వెల్లడించింది. ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని నేడు రోజున కేరళలోని నిలంబూరులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇదే వేదికపై సీఎం రేవంత్ రెడ్డికి అవార్డును అందజేయనున్నారు. ఈ పురస్కారం కింద రూ.1 లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేయనున్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కె.సి. వేణుగోపాల్ పాల్గొని ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేయనున్నారు.

### ఎవరీ ఆర్యదాన్ ముహమ్మద్?

కేరళ రాజకీయాల్లో సుదీర్ఘకాలం పనిచేసిన కాంగ్రెస్ నాయకుడు ఆర్యదాన్ ముహమ్మద్. నిలంబూర్ నియోజకవర్గం నుంచి ఆయన 8 సార్లు కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. వివిధ దశల్లో రాష్ట్ర మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. కేరళ శాసనసభ అధికారిక ప్రొఫైల్ ప్రకారం ఆయన కార్మిక సంఘాలు, రాజకీయ, ప్రజా జీవితంతో సుదీర్ఘంగా అనుబంధం కలిగి ఉన్నారు. ఆయన స్మారకార్థం ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ప్రతి ఏడాది ప్రజా సేవకు సంబంధించిన పురస్కారాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ క్రమంలో 2026 సంవత్సరానికి సంబంధించిన 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డును తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రకటించింది.

## తెలుగు రాష్ట్రాల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా మధుకర్

అమల్లోకి వస్తాయని పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా మధుకర్‌ను నియమించారు. ఆయన హైదరాబాద్ కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారు. అదేవిధంగా, తెలంగాణ రాష్ట్ర సంయుక్త సంస్థాగత ప్రధాన కార్యదర్శిగా వరంగల్ కేంద్రంగా పనిచేసేందుకు దశరథ్‌కు బాధ్యతలు అప్పగించారు.

ఈ మార్పుల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేయడంపై అధిష్టానం దృష్టి సారించినట్లు స్పష్టమవుతోంది.జాతీయ స్థాయిలోనూ పలు కీలక నియామకాలు జరిగాయి. జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా శివప్రకాశ్‌ను నియమించగా, ఆయనకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గోవా రాష్ట్రాల బాధ్యతలు అప్పగించారు. ఆయన ముంబై కేంద్రంగా పనిచేస్తారు. మరో జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శిగా సౌదాన్ సింగ్‌ను నియమించి, బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ బాధ్యతలను కేటాయించారు.

### ఇక ఇతర రాష్ట్రాల విషయానికొస్తే..

మహారాష్ట్రకు అజయ్ జమ్వాల్, బీహార్‌కు భిఖూభాయ్ దల్సానియా, ఝార్ఖండ్‌కు పవన్ సాయి, గుజరాత్‌కు రత్నాకర్, ఉత్తరాఖండ్‌కు ఫణీంద్రనాథ్ శర్మ, పంజాబ్-చండీగఢ్‌కు మంత్రి శ్రీనివాసులు, ఉత్తరప్రదేశ్‌కు ధరమ్‌పాల్, పశ్చిమ బెంగాల్‌కు అమితాబ్ చక్రవర్తిని రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శులుగా నియమించారు.

అసోం, త్రిపుర రాష్ట్రాలకు రవీంద్ర రాజు, హిమాచల్ ప్రదేశ్‌కు సిద్ధార్థన్, ఢిల్లీ-హర్యానాకు పవన్ రాణా, ఛత్తీస్‌గఢ్‌కు కరమ్‌వీర్, మధ్యప్రదేశ్‌కు చంద్రశేఖర్, ఒడిశాకు మానస్ మహంతిని నియమిస్తూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలకు సంబంధించిన సర్క్యులర్‌ను పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయ ఇన్‌చార్జ్ తరుణ్ చుగ్ అన్ని రాష్ట్ర శాఖలకు పంపించారు.

## బలమైన అభ్యర్థులను బరిలోకి దించాలి

ఏకతాటిపైకి తీసుకువచ్చి బలమైన అభ్యర్థులను బరిలోకి దించాలని ఆదేశించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తాడేపల్లి వైసీపీ కేంద్రకార్యాలయంలో వైసీపీ ప్రాంతీయ సమన్వయ కర్తలు(రీజినల్ కో-ఆర్డినేటర్లు)తో మాజీ సీఎం, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ సమావేశం అయ్యారు. స్థానిక సంస్థల ఎనికల్లో పార్టీ తరపున అభ్యర్థులను వేగంగా గుర్తించాలి అని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు.

### మంచి అభ్యర్థులను బరిలో నిలబెట్టాలి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన, మంచి అభ్యర్థులను నిలబెట్టాలి అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. ఎన్నికలు గట్టిగా చేయాలి అని దిశానిర్దేశం చేశారు. అభ్యర్థుల ఎంపికలో మనం తీసుకునే నిర్ణయాలు రేపు వచ్చే ఎన్నికల్లో ఉపయోగపడాలి అని దిశానిర్దేశం చేశారు. పార్టీలో అందరితో మాట్లాడి అందరి అభిప్రాయాలు తీసుకోండి అని సూచించారు. పలు దఫాలుగా వారితో చర్చించి అభ్యర్థులను జాబితాను తయారు చేయండి అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. పార్టీని ఒక్కతాటిపైకి తీసుకు వచ్చి ఎన్నికల్లో ముందుకు నడపాలి, స్థానిక నాయకత్వాన్ని ఎప్పకప్పుడు పర్యవేక్షిస్తూ బలోపేతం చేయాలి అని వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు.

### చంద్రబాబు వెన్నుపోట్లను ప్రజలకు వివరించాలి

రెండున్నరేళ్ల సీఎం చంద్రబాబు పాలనలో వైఫల్యాలను, ప్రజలకు జరిగిన వెన్నుపోట్లను ప్రజలకు వివరించాలి అని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ కో ఆర్డినేటర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రతి గడపవద్దకూ వెళ్లి, మన పాలనలో మంచి, ఈప్రభుత్వంలో వెన్నుపోట్లను వివరించాలి అని సూచించారు. ఈ రెండున్నరేళ్ల పాలనలో చంద్రబాబు పాలన వల్ల ప్రజలకు జరిగిన నష్టాలను, కష్టాలను వివరించాలి అని వైఎస్ జగన్ సూచించారు. పోలీసు బలంతో, అడ్డదారుల్లో గెలిచేందుకు చంద్రబాబు కుట్రలు పన్నుతారు అని చెప్పుకొచ్చారు. వాటిని ఎదుర్కొనేందుకు అన్నిరకాలుగా సిద్ధం కావాలి అని పిలుపునిచ్చారు. ఎక్కడి కక్కడ ప్రత్యామ్నాయాలు ఉంచుకోవాలి అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్లు బొత్స సత్యనారాయణ, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, అయోధ్యరామిరెడ్డి, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కురసాల కన్నబాబు, గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

### వైసీపీలో తీవ్ర విషాదం

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. ఏపీ లిడ్‌క్యాప్ మాజీ ఛైర్మన్, వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ మృతి చెందారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఈ ఉదయం గుండెపోటుతో రాజశేఖర్ కన్నుమూశారు.రాజశేఖర్ మరణించిన విషయం తెలుసుకున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. రాజశేఖర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆయన కుటుంబానికి ప్రసాదించాలని వైఎస్ జగన్ వేడుకున్నారు. వైసీపీ కోసం రాజశేఖర్ అంకితభావంతో పనిచేశారని, ప్రతి కార్యక్రమంలోనూ అత్యంత చురుగ్గా పాల్గొంటూ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించారని వైఎస్ జగన్ కొనియాడారు.

## ఖైరతాబాద్‌కి ఉపఎన్నికనే!

పార్టీ ఫిరాయింపులలో క్షమాపణ, ఘర్ వాపసీ అనే అంశం కూడా ఉంటుందని, నాగేందర్ ఇప్పటికీ తన సొంత పార్టీతోనే ఉంటూ సమావేశాలకు హాజరవుతున్నారని కాపాడే ప్రయత్నం చేశారు. రాజకీయాల్లో అంటరానితనాన్ని, పొరపాట్లను తుడిచేందుకే రాజ్యాంగం ఇలాంటి వెసులుబాటు కల్పించిందని ఆయన కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.అయితే, ఈ ఘర్ వాపసీ ప్రతిపాదనను జస్టిస్ బాగ్చి ఏమాత్రం ఆమోదించలేదు. స్వచ్ఛందంగా ఒక పార్టీ ప్రాథమిక సభ్యత్వాన్ని వదులుకున్న మరుక్షణమే అసెంబ్లీ సభ్యత్వాన్ని శాశ్వతంగా కోల్పోతారు అని స్పష్టం చేశారు. ఈ రకమైన వ్యూహాలు అనర్హత నుంచి కాపాడలేవని తేల్చిచెప్పారు. మీరు తిరిగి మీ సొంత పార్టీలోకి వెళ్లవచ్చు, కానీ కోల్పోయిన ఎమ్మెల్యే పదవి మాత్రం పునరుద్ధరణ కాదు. అంతగా కావాలనుకుంటే మీ పార్టీ మిమ్మల్ని రాజ్యసభకు పంపుకోవచ్చు అని కోర్టు అత్యంత ఘాటుగా వ్యాఖ్యానించింది. రెండు పార్టీల తరఫున ఒకేసారి చక్రం తిప్పే ప్రయత్నం చేయడం, బి-ఫారాలు తీసుకుని ఎంపీగా పోటీ చేసి, తిరిగి ఎమ్మెల్యే సీటును రక్షించుకోవాలని చూడటం రాజ్యాంగ విరుద్ధమని ధర్మాసనం తేల్చేసింది. 2023లో బీఆర్ఎస్ తరఫున గెలిచి, 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్‌పై సికింద్రాబాద్ నుంచి పోటీ చేయడం ద్వారా పదో షెడ్యూల్ నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించారని ధర్మాసనం అభిప్రాయపడింది. సుప్రీంకోర్టు కూడా హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించడంతో నాగేందర్ సభ్యత్వం అధికారికంగా రద్దయింది.ఈ తీర్పుతో ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉపఎన్నిక అనివార్యమైంది. రాజ్యాంగ స్ఫూర్తిని, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రధాన ఉద్దేశాన్ని కాపాడేలా సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఫిరాయింపు ఎమ్మెల్యేలకు ఇది ఒక గట్టి హెచ్చరికగా నిలవడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఊహించని రాజకీయ పరిణామాలకు దారితీసే అవకాశం ఉందనడంలో సందేహం లేదు.

## జ్ఞానేశ్ కుమార్ తక్షణమే దిగిపోవాలి

డిమాండ్ చేశారు. ఓటు దొంగతనం నుండే చట్టాల దొంగతనం వస్తుందని, ఈ రోజు ఓటు పోయింది, చట్టాలు చేసే వ్యవస్థ పోయింది, ఓటును దొంగిలించినట్లయితే, ఓటు దొంగతనం ద్వారా పార్లమెంటుకు ఎన్నికైన చట్టసభ సభ్యులు చేసిన ఏ చట్టమైనా, ఏ సంస్థాగత మార్పు అయినా కూడా చట్టవిరుద్ధమే అని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. ఈ గందరగోళానికి జ్ఞానేష్ కుమార్ బాధ్యుడని, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు దీనిపై ఆయన్ను తప్పుబట్టారని రాహుల్ తెలిపారు. ఓటు మన దేశానికి పునాది అని, మన ఓటును నాశనం చేశారని ఆరోపించారు. ఇది కేవలం ఓటుపై దాడి కాదు, ప్రతి భారతీయుడి భావప్రకటనా స్వేచ్ఛపై దాడి అన్నారు.ఓటర్ల హక్కులను పరిరక్షించే బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని, ఒకవేళ ఓటును ధ్వంసం చేస్తే రాజ్యాంగం పనిచేయడం లేదని రాహుల్ గాంధీ తెలిపారు. భారత ఎన్నికలలో రిగ్గింగ్ జరుగుతోందని, 2024 లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో అవకతవకలు జరిగాయని 100 శాతం ఖచ్చితత్వం ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికలు, 2024 ఎన్నికలు, విధానసభ ఎన్నికలు అన్నింటిలోనూ రిగ్గింగ్ జరుగుతోందని 99 శాతం కాదు, 100 శాతం ఖచ్చితత్వంతో చెప్పడానికి ఇప్పటికే అవసరమైన దానికంటే ఎక్కువ సమాచారం ఉందన్నారు. కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీలను పదేపదే ప్రభావితం చేసిన ప్రభుత్వ వ్యతిరేకత, ఈ మధ్య ఎన్నికలలో ఎందుకు అదృశ్యమైనట్లు కనిపిస్తోందని రాహుల్ ప్రశ్నించారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధం తర్వాత మాజీ ప్రధాని ఇందిరా గాంధీకి లభించిన ప్రజాదరణ.. ఆ తర్వాత కొన్నేళ్లలోనే ప్రభుత్వ వ్యతిరేకతగా మారడాన్ని రాహుల్ ఉదహరించారు. ఒకరి తర్వాత ఒకరుగా నాయకులకు సరిగ్గా ఇదే జరుగుతుందని, కాంగ్రెస్ నాయకులకు జరుగుతుంది, ప్రాంతీయ పార్టీలకూ జరుగుతుందని, కానీ ఏదో కారణం చేత, నరేంద్ర మోదీ గారికి మాత్రం ఇది ఎప్పుడూ జరగదన్నారు. షా గారికి జరగదు, బీజేపీకి జరగదన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్‌లలోని ఎన్నికల ఫలితాల సరళిని ప్రస్తావిస్తూ, అధికారంలో ఉన్నవారిపై వ్యతిరేకత ఉండే సంప్రదాయ ధోరణి మారిపోయిందని ఆయన వాదించారు. ఇది ఎందుకు జరుగుతుందో అర్థం చేసుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు.ఓటు అనేది మన దేశానికి పునాది అని, ఎన్నికల సంఘం ఆ ఓటుకు సంస్థాగత రక్షకురాలిగా వ్యవహరిస్తుందని తెలిపారు. ఓటు రాజ్యాంగానికి శక్తిని ఇస్తుందని, రాజ్యాంగం చట్టాల రూపకల్పనకు వీలు కల్పిస్తుందని, ఆ చట్టాలు వివిధ సంస్థల ఏర్పాటుకు దారితీస్తాయని ఆయన తెలిపారు. ఒకవేళ ఓటు వ్యవస్థ దెబ్బతింటే, మన రాజ్యాంగం కూడా దెబ్బతిన్నట్లే అన్నారు. దానికి ఇక శక్తి ఉండదు, అది పనిచేయదన్నారు. ఓటును రక్షించడంలో ఎన్నికల సంఘం తన బాధ్యతను విస్మరించిందని ఆరోపించారు. తన ఆరోపణలు కేవలం గాలిమాటలు కావన్నారు. తాను దీనిని ఆధారాలతో సహా చూపించానని గుర్తుచేశారు. జ్ఞానేష్ కుమార్ విషయంలో కొన్ని ప్రశ్నలు తలెత్తాయని, గతంలో తన ఆందోళనలను పట్టించుకోలేదని రాహుల్ గాంధీ ఆరోపించారు.

## 22ఏ పరిధిలో ఉన్నా

# రిజిస్ట్రేషన్లు అమలు

పొందినప్పటికీ సాంకేతిక లోపాలు, రెవెన్యూ వర్గీకరణల కారణంతో రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ నిషేధిత జాబితా పరిధిలో ఉండిపోయిన ఆస్తుల రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇవ్వాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఈ సరికొత్త ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ప్రకటించింది.గత కొంతకాలంగా 22ఏ నిషేధిత భూముల అంశంపై తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి కారణమైన సంగతి తెలిసిందే. ఇటీవలే ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లోనూ దీనిపై అధికార, ప్రతిపక్షాల మధ్య సుదీర్ఘ చర్చలు, ఆరోపణలు, విమర్శలు జరిగాయి. ఈ క్రమంలో రేవంత్ సర్కార్ ప్రజల ఇబ్బందులను తొలగిస్తూ ఈ సంచలన నిర్ణయం తీసుకుంది. మరోవైపు 22ఏ భూములకు సంబంధించి అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ చేపట్టేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక ప్రత్యేక కమిటీని నియమించింది. టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో రాజీవ్‌గాంధీ హనుమంతు, సందీప్‌కుమార్ ఝా, ఆయా జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో 22ఏ జాబితాలో ఉండి రిజిస్ట్రేషన్లు కాక ఇబ్బంది పడుతున్న లక్షలాది మందికి పెద్ద ఉపశమనం లభించినట్లయింది.

# ప్రకృతి నుండి వచ్చిన ప్రతిది తిరిగి ప్రకృతిలో కాలవాల్సిందనేదే గణేష్ నిమజ్జనం అంతరార్థం



జీవితంలో ఏదీ శాశ్వతం కాదనే గొప్ప ఆధ్యాత్మిక తత్త్వాన్ని, ప్రకృతిలో ప్రతీదీ లీనం కావాల్సిందేననే సత్యాన్ని గుర్తు చేయడమే గణేష్ నిమజ్జన అంతరార్థం. రూపం శాశ్వతం కాదని, కేవలం దైవ భావన మాత్రమే శాశ్వతమనే సందేశం,
మట్టి నుంచి వచ్చిన రూపం తిరిగి మట్టిలోనే కలిసి పోతుందనేది పర్యావరణ సిద్ధాంతం. గణేశ్ నవరాత్రులు వచ్చాయంటే ఇళ్లలో, వీధుల్లో సందడి మొదలవుతుంది. భక్తిశ్రద్ధలతో గణపతిని ప్రతిష్ఠిస్తారు. రోజు పూజలు చేస్తు నైవేద్యాలు పెడతారు. ఉత్సవాలు ముగిసిన తర్వాత అదే గణపతికి ఘనంగా వీడ్కోలు పలుకుతు విగ్రహాన్ని నీటిలో నిమజ్జనం చేస్తారు. అయితే గణపతి నిమజ్జనం అంటే కేవలం ఓ విగ్రహాన్ని నీటిలో కలపడం కాదు. దాని వెనుక ఆధ్యాత్మిక భావనతో పాటు ప్రకృతితో ముడిపడిన గొప్ప సందేశం ఉంది.

### దేవుడిని నిమజ్జనం

గణపతి విగ్రహ ప్రతిష్ఠలో దేవుడిని ఒక రూపంలో ఆహ్వానించి పూజిస్తాం. పూజ ముగిసిన తర్వాత ఉత్తరపూజ నిర్వహిస్తారు. ఇది వీడ్కోలు పలికే ఆచారం. ఆ తర్వాతే విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళతారు. అంటే నీటిలోకి వెళ్లేది గణపతి దైవస్వరూపం కాదని, పూజకు ఆధారమైన విగ్రహ రూపమేనని సంప్రదాయ భావన.

### రూపం తాత్కాలికం. దైవం కాదు

హిందూ తత్వంలో పరమాత్మను నిరాకారంగా భావించే సంప్రదాయం ఉంది. సామాన్య భక్తులు ఆ నిరాకారాన్ని ఆరాధించడం కష్టం. అందుకే ఒక రూపాన్ని ముందుంచుకుని పూజిస్తారు. దైవాన్ని మనకు చేరువ చేసే రూపం, పూజ పూర్తయ్యాక ఆ రూపాన్ని వదిలేయడం ద్వారా ఒక నిగూఢ సత్యం బోధపడుతుంది. రూపం శాశ్వతం కాదు. దైవభావం మాత్రం ఆ రూపానికే పరిమితం కాదు. అందుకే విగ్రహం కరిగిపోయినంత మాత్రాన గణపతి వెళ్లిపోయాడనే భావన ఉండదు. భక్తి మాత్రం కొనసాగుతుంది.

### మట్టి నుంచి మళ్లీ మట్టిలోకే

ఇక్కడ ప్రకృతి సందేశం కూడా ఉంది. సంప్రదాయ గణపతి విగ్రహాలు మట్టితో తయారయ్యేవి. మట్టికి నీరు కలిపి ఒక రూపం ఇస్తారు. ఆ రూపాన్ని గణపతిగా పూజిస్తారు. చివరికి నీటిలో నిమజ్జనం చేస్తే మట్టి మళ్లీ ప్రకృతిలో కలిసిపోతుంది. అంటే భూమి నుంచి వచ్చిన పదార్థంతో ఏర్పడిన రూపం తన మూలానికి తిరిగి వెళ్లడం. మనిషి జీవితానికీ ఇదే తాత్త్విక భావనను అన్వయిస్తారు. శరీరం ప్రకృతి నుంచి వస్తుంది. కొంతకాలం ఒక రూపంలో ఉంటుంది. చివరికి ప్రకృతిలోనే కలిసిపోతుంది.

### నిమజ్జనం ముగింపు కాదు

గణపతి నిమజ్జనం అంటే దేవుడికి శాశ్వతంగా వీడ్కోలు పలకడం కాదు. ఒక రూపంలో ఆహ్వానించిన దైవాన్ని తిరిగి తన నిరాకార స్వరూపంలో అన్వేషించడం. పూజలో ఏర్పడిన అనుబంధాన్ని వదులుకోని ప్రకృతి చక్రాన్ని అంగీకరించడమే పరమార్థం. అందుకే నిమజ్జనం సమయంలో భక్తులు బాధతో కన్నీళ్లు పెట్టుకున్నా చివర్లో గణపతి బప్పా మోరియా వచ్చే ఏడాది త్వరగా రావయ్యా అని హోరేత్తిస్తారు. వెళుతున్నది విగ్రహ రూపమే. కాని గణపతిపై ఉన్న విశ్వాసం మాత్రం ఇంట్లోనే మిగులుతుంది.

### పర్యావరణంతోనూ ముడిపడిన సందేశం

ఈ భావన సహజ మట్టి విగ్రహాల సంప్రదాయంతోను కలుస్తుంది. మట్టి నీటిలో కలిసిపోవడం ప్రకృతి చక్రంలో భాగం. కానీ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు, ప్లాస్టిక్ అలంకరణలు ఈ సహజ ప్రక్రియకు భిన్నంగా ఉంటాయి. అవి నీటి కాలుష్యానికి కారణమయ్యే అవకాశం ఉందని అందుకే సహజ మట్టి, సహజ రంగులు ఉపయోగించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు. వినాయక నవరాత్రుల పూజల అనంతరం గణపతి నిమజ్జనంలో విగ్రహాన్ని నీటిలో కలపడం మాత్రమే కాదు, రూపం తాత్కాలికమని గుర్తించడం, ప్రకృతి నుంచి వచ్చినదాన్ని ప్రకృతికే తిరిగి ఇవ్వడం, దైవాన్ని ఒక రూపానికే పరిమితం చేయకపోవడం వంటి జీవిత సత్యాలను గ్రహించి, ఈ ఆచారానికి ఉన్న అంతరార్థన్ని గుర్తించి మన సంప్రదాయాలను ఆచరించడం ప్రకృతికి మనమిచ్చే గౌరవం.



**రవికుమార్ సంతోజు**
**బడంగ్ పేట్, హైదరాబాద్**

# అక్టోబర్ 2న 'నో యూపీఐ డే'




న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో కీలకమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా జరిపే కొన్ని లావాదేవీలపై ఛార్జీలు విధించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై వ్యాపార వర్గాలు భగ్గుమన్నాయి. ఈ కొత్త నిబంధనలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అక్టోబర్ 2 (గాంధీ జయంతి) నాడు "నో యూపీఐ డే" పాటించాలని పలు వాణిజ్య, వ్యాపార సంఘాలు పిలుపునిచ్చాయి. ఆ రోజున తమ దుకాణాల్లోని యూపీఐ క్యూఆర్ కోడ్‌లు, స్కానర్లు, సౌండ్ బాక్సులను నల్లటి వస్త్రంతో కప్పివేసి నిరసన
తెలపాలని నిర్ణయించాయి.

### - అక్టోబర్ 15 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు

అక్టోబర్ 15 నుంచి యూపీఐ చెల్లింపులకు సంబంధించి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. దీని ప్రకారం, వ్యాపారులు (పి2ఎం – పర్సన్ టు మర్చంట్) స్వీకరించే రూ.2,000కు పైబడిన ప్రతి యూపీఐ లావాదేవీపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఒక లావాదేవీపై గరిష్ఠంగా రూ.300 మాత్రమే ఛార్జ్ చేస్తారు. అయితే, వ్యక్తుల మధ్య జరిగే (పర్సన్ టు పర్సన్) యూపీఐ లావాదేవీలపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. అలాగే, నెలకు రూ.1 లక్ష వరకు యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులకు కూడా ఈ ఎండీఆర్ నుంచి మినహాయింపు ఇచ్చారు. 2026 ఆగస్టు నెలలోనే వ్యాపారులకు రూ.8.95 ట్రిలియన్ల విలువైన 15.51 బిలియన్ల లావాదేవీలు జరగ్గా, అందులో రూ.2,000కు పైబడిన చెల్లింపుల వాటానే సుమారు 67 శాతం ఉండటం గమనార్హం.

### వ్యాపారుల ఆందోళన ఎందుకు?

తమకు ఇప్పటికే చాలా తక్కువ లాభాలు వస్తుండగా, ఇప్పుడు యూపీఐపై కొత్త ఛార్జీలు విధించడం వల్ల ఆర్థికంగా మరింత భారం పడుతుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిజిటల్ ఇండియాను ప్రోత్సహించి, పారదర్శక లావాదేవీలు జరుపుతున్న తమను ప్రోత్సహించాల్సింది పోయి, ఇలా ఛార్జీలతో శిక్షించడం సరికాదని వారు వాదిస్తున్నారు. మహారాష్ట్ర ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఆల్ ఇండియా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ ఫెడరేషన్ వంటి అనేక జాతీయ స్థాయి సంఘాలు ఈ నిరసనకు మద్దతు ప్రకటించాయి. ఈ అంశంపై పెట్రోలియం డీలర్లు, స్టాక్ బ్రోకర్లు కూడా తమకు మినహాయింపులు ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే పెట్రోలియం మంత్రిత్వ శాఖ డీలర్లతో చర్చలు జరపగా, క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలపై విధించిన 0.02 శాతం ఎండీఆర్‌పై బ్రోకర్ల ఆందోళనలను పరిశీలిస్తామని సెబీ హామీ ఇచ్చింది. అక్టోబర్ 15 లోగా ప్రభుత్వం ఈ ఛార్జీలను ఉపసంహరించుకోకపోతే తమ నిరసనను మరింత ఉద్ధృతం చేస్తామని వ్యాపార సంఘాలు హెచ్చరించాయి.

# రాహుల్, రేవంత్‌లకు "సుప్రీం చెంపపెట్టు"

ఎక్స్ వేదికగా స్పందిస్తూ, అనర్హత వేటు నుంచి తప్పించుకోవడానికి దానం నాగేందర్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. "ఫిరాయింపుల ద్వారా ప్రజా తీర్పును దొంగిలించి, స్పీకర్ చాటున దాక్కోవచ్చని రాహుల్, రేవంత్ భావించారు. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని ఫిరాయింపులను ప్రోత్సహించే వారి ప్రయత్నాలను ఈ తీర్పు బట్టబయలు చేసింది" అని కేటీఆర్ ఆరోపించారు. త్వరలో ఖైరతాబాద్‌లో జరగనున్న ఉప ఎన్నికల్లో ప్రజలు మూడేళ్ల ద్రోహానికి, హామీల ఉల్లంఘనకు తగిన తీర్పు ఇస్తారని ఆయన వ్యాఖ్యానించారు. "ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని పడతాయి" అని హెచ్చరిస్తూ, తన పోస్ట్ చివరలో "మార్క్ మై వర్డ్స్, ఎమ్మెల్యే చోర్ ఏరాహుల్‌గాంధీ" అని ఘాటుగా విమర్శించారు.

### కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిపై హరీశ్ రావు ఫైర్

సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ శాసనసభ ఉప నాయకుడు హరీశ్ రావు కూడా స్వాగతించారు. "రాజ్యాంగాన్ని కాపాడతాం" అని చెప్పే కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి ఇది చెంపపెట్టు అని అన్నారు. "పదేపదే 'సంవిధాన్ బచావో' అని నినదించే రాహుల్ గాంధీకి ఇప్పుడు అసలైన పరీక్ష ఎదురైంది. ఆయనకు నిజంగా రాజ్యాంగంపై నమ్మకం ఉంటే, కాంగ్రెస్‌లో చేరిన మిగతా ఎమ్మెల్యేలందరితో వెంటనే రాజీనామా చేయించి, తిరిగి ప్రజా తీర్పు కోరాలి" అని డిమాండ్ చేశారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడి, తెలంగాణలో తమ పార్టీ చర్యలపై మౌనంగా ఉండటం సరికాదని హరీశ్ రావు విమర్శించారు. "సంవిధాన్ బచావో అనేది రాజ్యాంగ నిబద్ధతా లేక కేవలం రాజకీయ నినాదమా?" అని ఆయన ప్రశ్నించారు.

# హైదరాబాద్ గణేశ్ బందోబస్తు విధుల్లో ఎస్సై దుర్మరణం

### - నిందితుడి కోసం పోలీసుల గాలింపు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భాగ్యనగర గణేశ్ నిమజ్జన బందోబస్తు విధుల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. హైదరాబాద్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన ఓ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) చికిత్స పొందుతూ మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టూటౌన్ ఠాణాలో ఎస్సైగా పనిచేస్తున్న కె. వెంకన్న (57) ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. వరంగల్ జిల్లాకు చెందిన ఆయన, గణేశ్ నిమజ్జన బందోబస్తు కోసం ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వచ్చారు. వివరాల్లోకి వెళితే, ఎన్టీఆర్ గార్డెన్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద ఎస్సై వెంకన్నకు విధులు కేటాయించారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత సుమారు 2 గంటల సమయంలో, సచివాలయం వైపు నుంచి అంబేద్కర్ విగ్రహం వైపు వేగంగా, నిర్లక్ష్యంగా వస్తున్న ఓ ద్విచక్ర వాహనదారుడు వెంకన్నను బలంగా ఢీకొట్టాడు.

ఈ ఘటనలో ఎస్సై రోడ్డుపై పడిపోగా తల, కుడి మోకాలు, కుడి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వ్యక్తి వాహనంతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు.ప్రమాదం అనంతరం, వెంకన్నను లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. కాస్త కోలుకున్న తర్వాత ఆయన సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఘటనపై ఫిర్యాదు చేసి, అనంతరం తన స్వగ్రామమైన కిష్టాపురానికి బయలుదేరారు. అయితే, గ్రామానికి చేరుకున్నాక మధ్యాహ్నం తర్వాత ఆయన ఆరోగ్యం ఒక్కసారిగా క్షీణించింది. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా, తలలో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకన్న కన్నుమూశారు. ఈ ఘటనపై సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.

# పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



**చిట్వేలి** సెప్టెంబర్ నెల 25న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం (డి వార్మింగ్ డే) నిర్వహించనున్న నేపథ్యంలో చిట్వేలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. చిట్వేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఎం. శివప్రసాద్ గౌడ్ ఆదేశాల మేరకు చిట్వేలి మండలంలోని 13 సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఆయా పాఠశాలలను సందర్శించి ప్రధానోపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. విద్యార్థుల్లో నులిపురుగుల సమస్యను నివారించడం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. చిట్వేలి పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు సోఫియా కు ఆల్బెండజోల్ మాత్రలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ కల్పన, ఏఎన్ఎంలు మరియా రాణి, కృష్ణవేణి, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, కన్యాకుమారి పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్యాలయంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



**తిరుపతి** ఆర్టీసీ కార్యాలయంలో చీఫ్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ సి.ఎస్. వర్మ ఆత్మహత్య కలకలం రేపింది. డీపీటీవో (ఆఖూ) కార్యాలయంలో ఫ్యాన్కు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు తోటి ఉద్యోగులు గుర్తించారు. ఉద్యోగి బదిలీ విషయంలో లంచం డిమాండ్ చేశారనే ఆరోపణలపై మూడు నెలల క్రితం వర్మను ఉన్నతాధికారులు సస్పెండ్ చేసారు. మృతుడు వచ్చే ఏడాది ఏప్రిల్ లో రిటైర్ కానున్నాడు. విధులు నిర్వహించిన తన చాంబర్ లో ఫ్యాన్ కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈస్ట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

# మార్వాడీ సేవా సమాజ్ గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్నా మంత్రి శ్రీధర్ బాబు

కోఠిలోని అస్మాత్‌గంజ్‌లో మార్వాడీ సేవా సమాజ్ ఆధ్వర్యంలో గత 98 ఏళ్లుగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు , ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ ఛైర్మన్ మధు యాష్కీ గౌడ్ , వీ.హెచ్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుని భక్తి పాటలక ప్రభుత్వ సలహాదారుడు వీ. హనుమంతరావు భక్తులతో కలిసి నృత్యం చేశారు. ముంబైలో ప్రసిద్ధి చెందిన లాల్‌బాగ్చా రాజా గణేశుడి తరహాలో నారాయణ్ లోయ ఆధ్వర్యంలో అస్మాత్‌గంజ్‌లో గణనాథుడిని ఘనంగా ప్రతిష్ఠించి ఉత్సవాలను నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తి, ఆధ్యాత్మికతతో పాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా కొనసాగాలని ఆకాంక్షించారు. సమాజ శ్రేయస్సు కోసం భక్తి శ్రద్ధలతో ఘననాథుడిని భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారని పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలంగా సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్న మార్వాడీ సేవా సమాజ్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా మండపంలో ప్రత్యేకంగా 12 జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. అలాగే భగవాన్ రాందేవ్ బాబా జీవిత చరిత్రపై వీడియో డాక్యుమెంటరీని ప్రదర్శిస్తున్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు చారిత్రక, సాంస్కృతిక అంశాలను పరిచయం చేసేలా నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధు యాష్కీ , వి.హెచ్ లతో కలిసి శ్రీధర్ బాబు ఆ డాక్యుమెంటరీని వీక్షించారు.

# కీసరలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

### - రోడ్డు దాటుతుండగా ప్రమాదం.. గాంధీ ఆసుపత్రికి తరలించేలోపే మృతి



**కీసర ( ప్రశ్న న్యూస్)** కీసరలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కీసర గ్రామానికి చెందిన మహ్మద్ షకీల్ (50) పంక్చర్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. సెప్టెంబర్ 23న రాత్రి సుమారు 8:30 గంటల సమయంలో కీసర ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద రోడ్డు దాటుతుండగా, కీసర గుట్ట నుంచి ఈసీఐఎల్ వైపు వెళ్తున్న టీజీఎస్ఆర్టీసీ బస్సు (టీస్ 04జడ్ 0247, రూట్ నంబర్ 242జి ) ఢీకొట్టింది. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు మృతుడి సోదరుడు మహ్మద్ జమీల్ అహ్మద్ అన్సారీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్సు ఢీకొనడంతో షకీల్ రోడ్డుపై పడిపోయి తీవ్ర గాయాలపాలయ్యాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో గాంధీ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు కీసర గ్రామంలో నివాసముంటూ పంక్చర్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఆయన స్వస్థలం బీహార్. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపరెందుకు..?

### - అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందన కరువు

**సి. బెళగల్,** మండల కేంద్రంలోని మాలగేరిలో డ్రైనేజీ సమస్య ఏళ్లుగా వేధిస్తున్నా అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు వెళ్లేందుకు సరైన కాలువ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామనితెలిపారు.మురుగునీరు రోడ్లపై నిలిచిపోవడంతో కాలనీలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని, నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని తెలిపారు.

ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, సమస్యను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరామని మాల మహానాడు జిల్లా నాయకుడు మునిస్వామి తెలిపారు. స్థానిక అధికారులను సంప్రదించడంతో పాటు జిల్లా అధికారులను సైతం కలిసి సమస్యను వివరించి వినతులు అందించినప్పటికీ ఇప్పటివరకు ఫలితం కనిపించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నిసార్లు విన్నవించినా సమస్య పరిష్కారం కాకపోవడానికి కారణమేంటి? సమస్య పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? డ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించారా? కేటాయించి ఉంటే పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు? అనే ప్రశ్నలు కాలనీవాసుల నుంచి వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికైనా అధికారులు స్పందించి మాలగేరిలో డ్రైనేజీ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి, మురుగునీరు రోడ్లపైకి రాకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. సమస్యను ఇకపై కూడా నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఇబ్బందులు మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు రాజశేఖర్ మృతి.. జగన్‌గ్బ్రాంతి

**హైదరాబాద్,** ఏపీ లిడ్‌క్యాప్ మాజీ ఛైర్మన్, వైసీపీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ ఆకస్మిక మృతి పట్ల ఆ పార్టీ అధినేత తీవ్రగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో ఈ ఉదయం గుండెపోటుతో రాజశేఖర్ కన్నుమూశారు. సమాచారం అందుకున్న జగన్ ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రాజశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆయన కుటుంబానికి ప్రసాదించాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పార్టీకి రాజశేఖర్ అందించిన సేవలను వైఎస్ జగన్ గుర్తు చేసుకున్నారు. వైసీపీ కోసం రాజశేఖర్ అంకితభావంతో పనిచేశారని, ప్రతి కార్యక్రమంలోనూ అత్యంత చురుగ్గా పాల్గొంటూ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించారని కొనియాడారు

## బిల్లులు రాక.. అప్పులు తీరక..

# గుత్తేదారులు అయోమయం

- బకాయిలు పై బకాయిలు - మోఖం చాటేస్తున్న సర్కార్. - బిల్లు పై బిల్లు ఇకరాదని, బెల్టుతో "ఉరి" కి సిద్ధం.?
- పరిషాన్ కడలిలో వ్యవసాయ మార్కెట్. - మార్కెట్‌లో బకాయిలు చెల్లించలేక,ముందుకు సాగలేక.
- బోయిన్ పల్లి మార్కెట్‌లో గుత్తేదారులకు లక్షల రూపాయలు బకాయిలు. - అరకోటి వరకు అప్పులు.?
- త్వరలో అంధకారంలోకి బోయిన్ పల్లి మార్కెట్.? - "14"నెలలుగా"25"లక్షల రూపాయలు విద్యుత్ బకాయిలు ?
- జనవరి నుంచి సెప్టెంబర్ వరకు గార్బెజ్ బకాయిలు, - గతంలో:జీ:చంద్రశేఖర్."8"లక్షలు,ఫిబ్రవరి నుంచి జూలై 2025.
- సంపంగి సాయి ప్రసన్న పెస్ట్ కంట్రోల్ 2025 లో ప్రారంభం,ఫాకింగ్ గత సంవత్సరం మార్చ్ వరకు బకాయిలు.
- సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కి ఇరవై ఐదు లక్షల రూపాయలు (పన్ను బకాయిలు )ఏరియాస్.
- మార్కెట్ యార్డు మరుగు దొడ్లు శుభ్రం చేసే మహిళకు గత పదిహేను నెలలుగా "లక్షన్నర"బకాయిలు.
- బోయిన్ పల్లి మార్కెట్ లో ప్రాథమిక చికిత్స కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న నర్సికి సుమారు లక్ష ఇరవై వెయ్యిలు పెండింగ్.?
- మార్కెట్ యార్డులో హమాలీలకు ప్రతి ఏటా నూతన డ్రెస్సులు ఇవ్వడం ఆనవాయితీ,ఈ సంవత్సరం మొండి చెయ్యి.
- బయో గ్యాస్ కేంద్రం ఏజెన్సీ కి సుమారు సంవత్సరం నుంచి ఖాళీ చెయ్యి.? కమిటీ వద్ద "సెక్యూరిటీ", బయో గ్యాస్ ఫైల్ సంతకం కాని వైనం.?
- సోల్జర్ సెక్యూరిటీ ఏజెన్సీకి వన్ ఇయర్ నుంచి చెక్ లేక చుక్కలు చూపిస్తున్న మార్కెటింగ్ డిపార్ట్మెంట్.

**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులతో సతమతమౌతుంది.గత పాలకుల నిర్వాకం వల్లే ఈ రోజు తెలంగాణ రాష్ట్రంలో గుత్తేదారులు గూడు చెదిరి గాడి తప్పిందని విశ్లేషకులు భావిస్తున్నారు.వారి మాటల్లోనే విందాం:గత సర్కార్ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో, వ్యవసాయానికి పెద్ద పీటం వెయ్యాలని జంటనగరాల్లో వివిధ శాఖల నుంచి వస్తున్న ఆదాయాన్ని "కాళేశ్వరంప్రాజెక్టు"నిర్మాణం కోసం వెయిల కోట్లు రూపాయలు వెచ్చించి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారు.ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో "సంద్రంలో మునిగిపోయే నావ"లా ఉంది వీరి పని తీరు.? ఏం చేయాలన్న ఆర్థిక ఇబ్బందులతో తలలు పట్టుకుంటున్నారు పాలకులు.ఒకటి రెండు కాదు అన్ని శాఖల్లో ఇదే పని తీరు.మరీ ముఖ్యంగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో దయనీయమైన పరిస్థితి నెలకొంది.రాష్ట్రంలో ఉన్న "167"మార్కెట్ యార్డులో ఇదే పరిస్థితి.? ఇదే విషయాన్ని శాసనసభలో ఎంఐఎం నాంపల్లి ఎమ్మెల్యే ఐదు నిమిషాలు మార్కెట్ యార్డు ల సుదీర్ఘంగా చర్చించారు. జరుగుతున్న పరిణామాలు సాక్షాత్తు శాసనసభ స్పీకర్ కి కళ్లకు కట్టినట్లు తెలియజేశారు.

**డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ యార్డులో "కోటి,అర కోటి వరకు బకాయిలు.?** బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో ప్రతి రోజూ దేశంలో ఉన్న పదిహేడు రాష్ట్రాల నుంచి వివిధ రకాల కూరగాయలు ముప్పై వేల టన్నుల కూరగాయలు దిగుమతి అవుతున్నాయి.ఇదిలా ఉంటే ఈ మార్కెట్ యార్డుకి ఏటా సుమారు"14"కోట్లు వసూలు అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.కానీ ఇక్కడ నుంచి వచ్చే ఆదాయం తప్ప మార్కెట్ లో నెలకొన్న మౌళిక సమస్యలు మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు పట్టవు.గత రెండు సంవత్సరాల నుంచి వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ లో పరిపాలన గాడి తప్పిందని విశ్లేషకులు చెబుతున్నారు.సాక్షత్తూ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి పలు మార్లు మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు వివిధ యార్డులో నెలకొన్న మౌళిక సదుపాయాల విషయం పై చర్చించినప్పటికీ ఫలితం శూన్యంగా మారిందని మార్కెట్ వర్గాలు అంటున్నాయి.

**ఉదహారణకు:డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్.** గార్బెజ్ కాంట్రాక్టర్ సమస్య నా భూతో నా భవిష్యత్. గత 5/7/25 సంవత్సరం జులై నుంచి జనవరి వరకు పెండింగ్లో ఉన్న బకాయిలు ఈ ఏడాది 4/9/26 న అక్షరాలా ఇరవై రెండు లక్షల రూపాయలు మార్కెటింగ్ డిపార్ట్మెంట్ చెల్లించింది.కానీ ప్రస్తుతం ఈ ఇయర్ జనవరి నుంచి జూలై వరకు ఇంకా రీలీజ్ కాకపోవడంతో గుత్తేదారులు గూడు చెదిరి కన్నీటిపర్యంతమవుతున్నారు.కార్మికులకు జీతాలు ఇవ్వలేక ఉన్న చిరాస్థిలు అమ్ముకోలేక.అలాగే అధిక వడ్డీలతో కాలం నెట్టుకుంటూ సమాజంలో జీవచ్ఛవంలా బతుకుతున్నారు.

**విద్యుత్ బిల్లులు మోత, లక్షల్లో బకాయిలు.?** బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో ఉన్న ప్రధాన కార్యాలయం,గ్రౌండ్లో ఐమాక్స్ లైట్లు,వీధిలైట్లు, ఓఆర్ఆర్ వాటర్ కేంద్రం, రైతు విశ్రాంతి భవనం, హమాలీల భవనం తదితర వాటి కోసం ఉపయోగించే విద్యుత్ వినియోగం ద్వారా వచ్చే కరెంట్ బిల్లు తడిసి పోయింది.ప్రస్తుతం ముప్పై లక్షల రూపాయలు బకాయిలు ఉండడం విశేషం.ఏ రోజు మార్కెట్ యార్డు చీకటిలోకి జారుకుంటుందో కాలం చెబుతుంది.

**ప్రాథమిక ఆరోగ్య కేంద్రం:** డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ కి ప్రతి రోజూ ఇరవై ఐదు వేల మంది రాకపోకలు సాగిస్తున్నారు.అలాగే యార్డులో హమాలీలు సుమారు రెండు వేల మంది కార్మికులు సేవలు అందిస్తున్నారు.వీరితో పాటు కమీషన్ ఏజెంట్లు కూడా వందల సంఖ్యలో ఉంటారు.ఇంత పెద్ద వ్యవస్థలో పేరుకే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం.గత ఎనిమిది నెలలుగా ఆ కేంద్రం మూసివేశారు.కారణం ఆ కేంద్రంలో విధులు నిర్వహించే "నర్సి"కి ఎనిమిది నెలలుగా గౌరవ వేతనం ఇవ్వకపోవడంతో ఆ మహిళ శాస్వతంగా పని మానేసింది.ఇదే మార్కెట్ లో గతంలో ముగ్గురు వ్యక్తులు (హమాలీలు) గుండె పోటుతో తనువు చాలించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కి ఆస్తి పన్ను బకాయిలు. కంటోన్మెంట్ బోర్డు కి గత సంవత్సరం నుంచి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ సుమారు ఇరవై ఐదు లక్షల రూపాయలు పన్నులు చెల్లించకుండా బకాయిలు పడ్డారు.

**హమాలీ "డ్రెస్ లు" తుస్:** వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు ప్రతి ఏటా మార్కెట్ లో విధులు నిర్వహిస్తున్న హమాలీలకు రెండు వేల రూపాయల విలువైన డ్రెస్ లు వారికి అందించడం ఆనవాయితీ.కానీ ప్రతి సారి జరిగే సాంప్రదాయ ఈసారి మార్కెట్ ఉన్నత అధికారులు మర్చిపోలేదు "మనీ" లేక మనకెందుకు అనుకున్నారు.

**దేశానికే మణిహారం, బయో గ్యాస్ కేంద్రం:** దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో బోయిన్ పల్లి మార్కెట్ లో "బయో గ్యాస్ కేంద్రాన్ని"మనీ కీ బాత్ లో వెల్లడించారు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. దీన్ని (బోయిన్ పల్లి మార్కెట్ లో ఏర్పాటు చేసిన బయో గ్యాస్ కేంద్రం) ఆదర్శంగా తీసుకుని పలు రాష్ట్రాల వ్యవసాయ మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు దీని పని తీరును తెలుసు కొని వారి రాష్ట్రంలో ఏర్పాటు చేయ్యాలనే ఆలోచనతో ఉన్నారు.కానీ ప్రస్తుతం ఈ బయో గ్యాస్ కేంద్రం ఏజెన్సీ కి సుమారు సంవత్సరం నుంచి జీతాలు చెల్లించలేని దుస్థితిలో బోయిన్ పల్లి మార్కెట్ ఉన్నది.కాని విశ్వసనీయ సమాచారం మేరకు బయో గ్యాస్ కేంద్రం ద్వారా ఎలాంటి లాభం లేదని, పూర్తి స్థాయిలో నష్టాల్లోనే కూరుకుపోతున్న పరిస్థితి నెలకొందని మార్కెట్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నారు.





**సోల్జర్ సెక్యూరిటీ ఏజెన్సీకి బకాయిలు:** దేశానికి సేవలు అందించి రిటైర్మెంట్ అయిన సోల్జర్స్ కి రాష్ట్ర ప్రభుత్వం కొన్ని కాంట్రాక్ట్ ల్లో వెసులుబాటు కల్పించింది.దీన్ని కొందరు ఇంటి దగ్గర ఖాళీగా ఉండేదానికన్న ఇలాంటి అవకాశాలు ఉపయోగించుకోవాలనే నేపథ్యంలో బోయిన్ పల్లి మార్కెట్ యార్డులో "సెక్యూరిటీ"టెండర్లు పిలిచారు.ఈ క్రమంలో ఒక రిటైర్డ్ జవాన్ "సోల్జర్స్ సెక్యూరిటీ ఏజెన్సీ"పేరు పై కాంట్రాక్ట్ కైవసం చేసుకున్నారు.పాపం అభం శుభం తెలియని ఆ వ్యక్తికి గత ఏడాది నుంచి మార్కెటింగ్ డిపార్ట్మెంట్ అధికారులు బకాయిలు చెల్లించక మొండి చెయ్యి చూపుతున్నారు.ఇంతదయనీయమైన పరిస్థితిలో మార్కెట్ యార్డులు ఉన్నాయంటే వ్యవసాయ శాఖ మంత్రి,ప్రభుత్వం సిగ్గు పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.మార్కెట్లల్లోనెలకొన్న మౌళిక సమస్యలు వీలైనంత వరకు తీర్చాల్సిన బాధ్యత రైతు బిడ్డ అయిన వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై ఉందంటున్నారు అన్నదాతలు.

## తుఫాను ప్రభావంతో కూలిన ఇంటి గోడ..
## తప్పిన పెను ప్రమాదం



**చింతపల్లి, /అరకులోయ** బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఓ ఇంటి గోడ కూలిపోయింది. ఈ ఘటనలో పెను ప్రమాదం తప్పింది.చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని గేర్రిలగడ్డ గ్రామానికి చెందిన బురిడీ నాగేష్.ఇంటి గోడ గురువారం తెల్లవారుజామున సుమారు 4 గంటల సమయంలో కూలిపోయింది. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో గోడ ఒక్కసారిగా కూలి బయటివైపు పడటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.గోడ ఇంటి లోపలివైపు కూలి ఉంటే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఉదయాన్నే బాలరాజు ఇంటికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మరియు చౌడు పల్లి పంచాయతీ సత్యవారం పాత వీధి గ్రామంలో గేమెలి వెంకటరావు ఇల్లు గోడ కూడా కూలిపోయింది ఈ ఇల్లు దెబ్బతినడంతో ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి కోరారు.ఈ సందర్భంగా పీసా కమిటీ సభ్యులు జి. అప్పలస్వామి, బి. రఘురాం. బురిడీ నాగేష్ కుటుంబాన్ని పరామర్శించి, ఇంటి నష్టాన్ని అధికారులు పరిశీలించి వెంటనే నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## సీహెచ్‌డబ్ల్యూగా పనిచేస్తున్న
# మహిళ అనారోగ్యంతో మృతి



**చింతపల్లి,/అరకులోయ** గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సీహెచ్‌డబ్ల్యూగా పనిచేస్తున్న తగ్గి మంగకుమారి గురువారం ఉదయం 10 గంటలకు మృతి చెందారు.అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం లోతుగడ్డ పంచాయతీ పరిధిలోని బందబయలు గ్రామానికి చెందిన తగ్గి మంగకుమారి, లోతుగడ్డ పిహెచ్సి బందబయలు గ్రామంలో సీహెచ్‌డబ్ల్యూగా విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె గురువారం తుదిశ్వాస విడిచారు. ఆమెకు భర్త సోమలింగం, ఇద్దరు పిల్లలు ఉన్నారు.మంగకుమారి మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై ఆదివాసీ గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవిగ్ర్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, మంగకుమారి అంత్యక్రియలు శుక్రవారం (సెప్టెంబర్ 25) ఉదయం 9:30 గంటలకు బందబైలు గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. బంధువులు, స్నేహితులు, గ్రామస్తులు సకాలంలో హాజరై అంత్యక్రియల్లో పాల్గొనాలని కుటుంబ సభ్యులు కోరారు.

## ఎస్సై, కానిస్టేబుల్, పోలీస్ పోస్టులకు
## నోటిఫికేషన్ విడుదల చేయాలి




**చిట్వేలి** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఇతర పోలీస్ పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర నాయకులు దార్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు రైల్వే కోడూరు డిప్యూటీ తహసిల్దార్ సుధీర్ రెడ్డి కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారని తెలిపారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేసి నియామక ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న ఇతర పోస్టులను కూడా గుర్తించి, నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేయాలని కోరారు. సంవత్సరాల తరబడి ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు వయోపరిమితి సమస్యలు ఎదురవుతున్నందున ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన న్యాయం చేయాలని అన్నారు. నిరుద్యోగ యువతకు ఇచ్చిన ఉద్యోగ హామీలను అమలు చేసి, పోలీస్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని బూర వాసు డిమాండ్ చేశారు. 11,000 ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులతో పాటు ఇతర పోలీస్ పోస్టులకు నోటిఫికేషన్లు విడుదల చేసి భర్తీ చేసే వరకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత పక్షాన ఉద్యమాలను కొనసాగిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకొండ సుధీర్, పాలతోటి ప్రకాష్, జంగిటి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు.

## పల్నాడు ఎస్పీగా జగదీష్ ఆదహళ్లి
## బాధ్యతల స్వీకరణ

**నరసరావుపేట:** పల్నాడు జిల్లా నూతన ఎస్పీగా జగదీష్ ఆదహళ్లి గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించి జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, పోలీసు శాఖ పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడం, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించి ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించాలని సూచించారు.

## గాలి ద్వారా వ్యాపించే ఇన్ఫెక్షన్లపై
# మెడిసిటీ గ్రూప్ ఆఫ్ కాలేజీలో రాష్ట్ర స్థాయి సదస్సు






**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** గాలి ద్వారా వ్యాపించే ఇన్ఫెక్షన్ల పై ఒక రోజు రాష్ట్ర స్థాయి సదస్సును మేడ్చల్ జిల్లా ఘనపూర్ లోని మెడిసిటీ గ్రూప్ ఆఫ్ కాలేజీలో ఘనంగా నిర్వహించారు.గాలి ద్వారా వ్యాపించే ఇన్ఫెక్షన్ల పై మెడిసిటి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఒక రోజు తెలంగాణా రాష్ట్ర స్థాయి (నిరంతర వైద్య విద్య) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా గాలి ద్వారా వ్యాపించే ఇన్ఫెక్షన్ల వ్యాప్తి అటు పిమ్మట వ్యాప్తి కారణంగా ఏర్పడే మహమ్మారి ని ప్రస్థుతం ఆధునిక ఎ ఐ సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో ఎలా ఎదుర్కోవచ్చనే విషయంపై చర్చించారు. తెలంగాణా నుండే కాకుండా విదేశాల నుండి వచ్చిన నిపుణులు కార్యక్రమానికి హాజరైన వారికి విషయంపై పలు మార్పులను వివరించడమే కాకుండా వాటి పరిష్కార మార్గములను సూచించారు.తెలంగాణా నలుమూలల నుండి వచ్చేసిన పలువురు వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో సాంప్రదాయబద్ద ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథి గా ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు, లోటస్ చిల్డ్రన్స్ హాస్పిటల్ వ్యవస్థాపకులు డా. వి యస్ వి ప్రసాద్ జ్యోతి ప్రజ్వళన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో డా వి యస్ వి ప్రసాద్ తో పాటూ షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కె శివరామకృష్ణ ఐనిష్ మర్చంట్, సీఈఓ , మెడిసిటి గ్రూప్ ఆప్ హాస్పిటల్స్ డా. గీత, డైరెక్టర్, మెడికల్ అడ్మినిస్ట్రేషన్, మెడిసిటి హాస్పిటల్ -- డా. మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్, అకడమిక్స్, షేర్ మెడికల్ మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ప్రిన్సిపల్ డా. దేవేంద్ర సింగ్ నేగి పాల్గొన్నారు.ఈ సందర్భంగా షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ కే శివరామకృష్ణ మాట్లాడుతూ వైద్య విద్యలో ప్రతి రోజు కొత్త విషయాలు వెలుగులోనికి రావడమే కాకుండా సరికొత్త పరిష్కారమార్గాలు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోనికి వస్తున్నాయని అన్నారు. ఈ సరికొత్త అంశాలను ఎప్పటికపుడు తెలుసుకోవడమనేది తమ వద్దకు వచ్చే రోగులకు అత్యున్నత చికిత్స అందించడానికి ఎంతో అవసరమని అందుకే వైద్య విద్యలో భాగంగానే కాకుండా విద్య పూర్తి చేసి ప్రాక్టీసు చేస్తున్న వైద్యులకు కూడా సీఎంఇ కార్యక్రమాల ద్వారా ఎప్పటికపుడు నేర్చుకోవడం తప్పనిసరి చేయడం జరిగిందని వివరించారు. ఇందులో భాగంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా. వి యస్ వి ప్రసాద్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరముల క్రితమే ప్రపంచం కోవిడ్ మహమ్మారిని ఎదుర్కొందని గుర్తు చేస్తూ ఆ తర్వాత కాలంలో చిన్నారులలో శ్వాస సంబంధిత ఇబ్బందులను ఎక్కువగా చూస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా గాలిలో వచ్చే ఇన్ఫెక్షన్ల కారణంగా ఏర్పడే ఈ ఇబ్బందులను ఎలా గుర్తించాలి, ఎలా వాటిని అధిగమించాలి అన్న అంశంపై ఎంతో చర్చించాల్సిన అవసరం ఉందని అంటూ ఈ అంశంపై జరిగే ఈ కార్యక్రమంలో అన్ని అంశాలను చర్చించి సరైన పరిష్కారాలను నేర్చుకొనే దిశగా సాగుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అనంతరం రోజంతా జరిగిన కార్యక్రమంలో ప్రముఖ పల్మనాలజిస్టు డా. విజయకుమార్, అమెరికాలోని ఇల్లనాయిస్ విశ్వవిద్యాలయం నుండి వచ్చిన డా. విజయ్ యెల్దండి తో పాటూ పలువురు ప్రముఖ వైద్య నిపుణులు పలు అంశాలపై ప్రసంగించారు. అనంతరం జరిగిన చర్చా కార్యక్రమంలో డా. శైలేంద్ర, వైస్ ప్రిన్సిపల్, డా. రాజేష్ దేశ ముఖ్, అమెరికన్ క్యాన్సులేట్ ముంబయి కు చెందిన పబ్లిక్ హెల్త్ నిపుణులు పాల్గొని వైద్య రంగానికి పరిశ్రమలను, విద్యా సంస్థలను అనుసంధానిచడంపై చర్చించారు.చివరగా కార్యక్రమానికి హాజరైన వారికి ప్రత్యేక సర్టిఫికేట్లు అందించారు. ఈ కార్యక్రమంలో డా వి యస్ వి ప్రసాద్ తో పాటూ ప్రొఫెసర్ కె శివరామకృష్ణ, ప్రసిడెంట్, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ శ్రీ ఐనిష్ మర్చంట్, సీఈవో మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డా. గీత, డైరెక్టర్, మెడికల్ అడ్మినిస్ట్రేషన్, మెడిసిటి హాస్పిటల్ డా. మల్లికార్జున రెడ్డి, డైరెక్టర్, అకడమిక్స్, షేర్ మెడికల్ కేర్ ఫౌండేషన్ డా. దేవేంద్ర సింగ్ నేగి, ప్రిన్సిపల్, మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డా శైలేంద్ర, వైస్ ప్రిన్సిపల్, మెడిసిటి ఇన్సిస్టిట్యూట్ ఆప్ మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్ యస్ హైమావతి, ప్రిన్సిపల్, మెడిసిటి కాలేజి ఆఫ్ నర్సింగ్ డా. మహమ్మద్ రఫి, ప్రిన్సిపల్, మెడిసిటి కాలేజి ఆఫ్ ఫిజియోథెరపీ డా. రమేష్ రెడ్డి, ప్రొఫెసర్, మెడిసిటి కాలేజి ఆఫ్ పబ్లిక్ హెల్త్ తో పాటూ పలువురు అధ్యాపకులు, వైద్యులు, వైద్య విద్యార్థి, విద్యార్థిణులు, నర్సింగ్ మరియు పారా మెడికల్ విద్యార్థి, విద్యార్థిణులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం



**నాచారం (ప్రశ్న న్యూస్)** పురాతన కాలం నుండి వస్తున్న ఆయుర్వేద చికిత్స విధానం ఒక సహజ వైద్య విధానమని, ఆయుర్వేద వైద్యంలో కేవలం వ్యాధి లక్షణాలను మాత్రమే అణచివేయకుండా మూలాలను గుర్తించి వ్యాధులను సమూలంగా నిర్మూలించి శరీరాన్ని శాశ్వతంగా ఆరోగ్యప్రదంగా చేయడానికి సహకరిస్తుందని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. సత్యనారాయణ ఉద్ఘాటించారు. 11 వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకొని నాచారం ఈఎస్ఐ ఆసుపత్రి లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతు ఆరోగ్యకరమైన జీవన విధానంలో సమగ్ర ఆరోగ్య పరిరక్షణలో ఆయుర్వేద చికిత్స ప్రాధాన్యతను వివరించారు.

### ఈఎస్ఐ ఆసుపత్రిలో ఆయుర్వేద చికిత్సలు

నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో 1992 వ సంవత్సరంలో స్థాపించబడిన ఆయుర్వేద విభాగం, అప్పటి నుండి నేటి వరకు నిర్విరామంగా రోగులకు ఆయుర్వేద వైద్య సేవలను అందిస్తోంది. ఆసుపత్రి మొదటి అంతస్తులో అందుబాటులో ఉన్న ఆయుర్వేద ఓ.పి లో వైద్యులు రోగుల నుండి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి అవసరమైన మేరకు ఆయుర్వేద మందులు అందిస్తున్నారు. అలాగే ఈ ఆయుర్వేద వైద్య సదుపాయాన్ని ఈఎస్ఐ బీమా పొందిన వ్యక్తులతో పాటు అర్హత కలిగిన వారి కుటుంబ సభ్యులు కూడా వినియోగించుకునే సదుపాయం ఉందని సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డా. రాజరాజేశ్వరి, ఫార్మసిస్ట్ వి. వేణుకుమార్ ఆయుర్వేద చికిత్సలపై అవగాహన కల్పిస్తు ప్రాచీన కాలం నుండి అందుబాటులో ఉన్న ఆయుర్వేద వైద్యంతో దీర్ఘకాలంగా బాధిస్తున్న మొండి వ్యాధులు పూర్తిగా తొలిగిపోతాయని, ప్రజలు ఆయుర్వేద మందుల ప్రాధాన్యతను గుర్తించి ఆయుర్వేద చికిత్సలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం" అనే సందేశంతో, ఆయుర్వేదం, వ్యాధి నివారణ, ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బందితో పాటు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఘనంగా గణనాథుని పూజలు



**బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్)** శ్రీ సాయి బాలాజీ హోమ్స్ పేస్ 2 రోడ్ నంబర్ 1లో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడు నిత్యపూజలతో భక్తులను అనుగ్రహిస్తున్నాడు. ప్రతి రోజు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన, భజనలు, పలు సంస్కృతిక కార్యక్రమాలతో ఈ ప్రాంతమంతా విఘ్నేశ్వరుని నామస్మరణతో మార్మోగుతుంది. సంవత్సరం వినాయక చవితి సందర్భంగా ప్రతి సంవత్సరం విభిన్న రూపాల్లో ఉన్న భారీ వినాయక విగ్రహాన్ని ప్రతిష్టించి సామూహిక నిమజ్జనం వరకు 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నామని మండప నిర్వాహకులు సాయికుమార్, గంటాల. పవన్ తెలిపారు. మండపంలో ప్రతి రోజు సాయంత్రం పూజలు, తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణతో పాటు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండప నిర్వహణలో శ్రవణ్, ప్రవీన్, ప్రశాంత్, రాం, మనోహర్, రాజారామేశ్వర్, ఉదయ్, మెహర్ నాథ్, లక్ష్మి నారాయణ, రాజా, నారాయణ రమేష్, సంతు తదితరులు చోరవతో ఆహ్లాదకర వాతావరణంలో గణేష్ నవరాత్రుల వేడుకలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# నిమజ్జనానికి వేళాయే



**సుల్తాన్ బజార్ (ప్రశ్న న్యూస్)** వీనస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక మండపంలో కొలువైన విఘ్నేశ్వరుడు ప్రత్యేక పూజలు అందుకుంటు భక్తులకు దర్శనమిస్తున్నాడు. గత 11 రోజులుగా అత్యంత వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న పూజలతో తుది ఘట్టానికి చేరుకున్నయి. శుక్రవారం నాటి నిమజ్జన కార్యక్రమంతో గణేష్ నవరాత్రుల వేడుకలు ముగియనున్నాయి. ఈ సంవత్సరంతో గణేష్ నవరాత్రుల ఉత్సవాలు 50 సంవత్సరాలు పూర్తి చేసుకని స్వర్ణోత్సవాల వేడుకలు జరుపుకోవడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని శాంత్ కుమార్ తెలిపారు. ఇక నవరాత్రుల మొదటి రోజు నుండి నిమజ్జనం రోజు వరకు (11 రోజుల) పాటు సంతోష్ (టోని) నేతృత్వంలో స్వామివారికి ప్రసాధం సమర్పించడమే కాక 50 సంవత్సరాల వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా బుధవారం నాడు 15 కేజీల బరువు ఉన్న 56 రకాల స్వీట్లను ప్రసాధంగా సమర్పించడం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా వీనస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతోష్ (టోని) ని ఘనంగా శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమానికి మురళి (లడ్డు) సుచేంద్ర, దాస్, చిద్విలాస్, అరుణ్, అభి తదితరులు పాల్గొన్నారని శాంత్ కుమార్ తెలిపారు.

# తుది ఘట్టానికి చేరుకున్న గణేష్ ఉత్సవాలు



**నారాయణగూడ (ప్రశ్న న్యూస్)** వినాయక నవరాత్రుల్లో భాగంగా నారాయణగూడ లోని ఆశిష్ ఆర్చిడ్ అపార్ట్మెంట్ లో రంగురంగుల విద్యుత్ దీపాలతో అత్యంత ఆకర్షణీయంగా అలంకరించిన మండపంలో ప్రతిష్ఠించిన వినాయక పూజలు తుది ఘట్టానికి చేరుకున్నాయి. గత 11 రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గణపతి నవరాత్రులు శుక్రవారం నాటి నిమజ్జనంతో ముగియనున్నాయి. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న పూజల శుక్రవారం ఉదయం మహప్రసాధ నివేదన, మహహారతి అనంతరం విఘ్నేశ్వరుడు నిమజ్జనానికై సాగరతీరం చేరుకోనున్నారని నిర్వాహకులు తెలిపారు. బుధవారం నాడు సాయంత్రం కాశికార్ కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామివారికి ప్రత్యేక నైవేద్యాలను నివేదన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. గణేష్ నవరాత్రుల్లో మొదటి నుండి ఆఖరి రోజు వరకు పాల్గొని నవరాత్రుల ఉత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేసిన డాక్టర్ భగవంత్ రావ్, శ్రీ జస్మేత్‌జీ పటేల్, వీపీ రాకేష్ జైస్వాల్, శ్రీ వై కృష్ణ, శ్రీమతి శశికళ, గోవింద్ జీ రాఠీ, మేఘా రాణి అగర్వాల్, ఉమేష్ సింఘానియా, సతీష్ జీ జాజు లకు మండప నిర్వాహకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# విజ్ఞానగిరిపై వైభవంగా వినాయక చవితి వేడుకలు.



**శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి దేవస్థానానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. నవరాత్రి చవితి వేడుకల్లో భాగంగా 11వ రోజున ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో లక్ష్మీ గణపతి రుద్ర హోమాన్ని నిర్వహించారు. ఈ విశేష హోమాది కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పాల్గొని విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు సమర్పించారు. లోకకళ్యాణం, నియోజకవర్గ ప్రజల శ్రేయస్సును కాంక్షిస్తూ నిర్వహించిన ఈ పవిత్ర కార్యక్రమాల్లో ఎమ్మెల్యేతో పాటు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో 11 రోజులపాటు గణపతి చవితి వేడుకలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. 11వ రోజున లోకకళ్యాణార్థం హోమాది కార్యక్ర మాలను శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు చెప్పారు. ఈ పూజల ఫలితంగా లోకం సుభిక్షంగా ఉండాల ని, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు సంక్షేమ పథకాలతో సుభిక్షంగా జీవించేలా గణనాథుడు ఆశీస్సులు అందించాలని కోరుకున్నట్లు పేర్కొన్నారు.

# శ్రీకాళహస్తిలో ఘనంగా వల్లభ గణపతి నిమజ్జనం



**శ్రీకాళహస్తి( ప్రశ్న న్యూస్)** శ్రీకాళహస్తి పట్టణంలోని బేరివారి మండపం వద్ద వల్లభ గణపతిని కొలువుదీర్చి,బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో తొమ్మిది రోజులపాటు వినాయక చవితి వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తొమ్మిదవ రోజు గణనాథుని నిమజ్జన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, భాజాభజంత్రీలు, టపాకాయల మోతల మధ్య భక్తుల సందడి నడుమ నిమజ్జన కార్యక్రమం కన్నులపండువగా సాగింది. ఈ నిమజ్జన కార్యక్రమానికి బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవన్, ఏపీ రాష్ట్ర కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు జనసేన చంద్ర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు కోలా విశాలాక్ష్మి ఆధ్వర్యంలో వీధి వ్యాపారులకు చలువ గొడుగులను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవన్ చేతుల మీదుగా అందజేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ వేడుకల్లో పాల్గొనడం తనకు సంతోషాన్ని కలిగించిందని పేర్కొన్నారు.

# ధర్పల్లి, సిరికొండ అధికారులకు విబిజిరాంజీ పథకంపై ఒక రోజు శిక్షణ



**ధర్పల్లి(ప్రశ్న న్యూస్)** ధర్పల్లి మండలంలోని రైతు వేదిక యందు ధర్పల్లి, సిరికొండ మండలాలకు చెందిన అధికారులు, సర్పంచులతో విబిజిరాంజీ పథకంలో భాగంగా వీజీ పిపి ప్రణాళిక తయారు చేయుటకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నోడల్ అధికారి డి శ్రీనివాసరావు(డీపీవో), ఆధ్వర్యంలో నిర్వహించనైనది ఈ కార్యక్రమం నందు గ్రామంలో వేజ్ పేమెంట్,మెటీరియల్ పేమెంట్ కు ప్రణాళికలు తయారు చేయుటకు పనులను గుర్తించాలని,అదే విధంగా ఈ పనులను గ్రామసభయందు ఆమోదించాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో నీటి సంరక్షణ, గ్రామీణ మౌలిక వసతుల కల్పన, గ్రామీణ జీవనోపాధి మౌలిక సౌకర్యాలు, వరద నివారణ చర్యలు ఎల్ఇను సందర్భముగా పనులు చేపట్టాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ధర్పల్లి,సిరికొండ, ఎమ్మార్వో ధర్పల్లి మాస్టర్ ట్రైనర్ ఓంపాల్ సిరికొండ ధర్పల్లి మండల స్థాయి అధికారులు సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# గబ్బిలాల పేటలో ని ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలన



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** గబ్బిలాల పేటలో అద్దె ఇంట్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు నూతన భవనాన్ని నిర్మించేందుకు గాను స్థలాన్ని పరిశీలించిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. గురువారం కాప్రా మండలంలోని గబ్బిలాల పేటలో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలను జిల్లా కలెక్టర్ మను చౌదరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ ఎంత మంది విద్యార్థులు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. స్కూలు లోని తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. అధార్ లేని పిల్లలకు ఆధార్ క్యాంప్ నిర్వహించి ఆధార్ అందించాలని కాప్రా తహసీల్దారును ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం నూతన భవనాన్ని నిర్మించేందుకు స్థల సేకరణ నిమిత్తం స్థల వివరాలను తహసీల్దారును అడిగి తెలుసుకున్నారు. గబ్బిలాల పేటలోని సర్వే నంబర్లు 285, 299, 300, 185 లలో అందుబాటులో ఉన్న స్థలాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సర్వే నంబర్లలో ఏమైనా భూ సమస్యలు, కోర్టు కేసులు ఉన్నాయా అనే వివరాలను తకు నివేదిక పంపాలని తహసీల్దారుకు సూచించారు. స్థానికులు 300 లేదా 185 సర్వే నంబర్లలో నిర్మిస్తే అందరికి అందుబాటులో ఉంటుందని కోరాగా, పరిశీలిస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా విద్యాశాఖ వారు ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించాడానికి ముందుగానే అనుమతించడం జరిగిందని వివరించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖాధికారి రేణుక, కాప్రా మండల తహసీల్దార్ మతిన్, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భద్రరెడ్డి జన్మదిన వేడుకలు

– ప్రైమరీ స్కూల్ లో బుక్కులు, పెన్నులు పంపిణీ చేసిన తుడుం గణేష్



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** ఎంతో మంది పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు ఏర్పాటు చేసి వారికి వైద్య పరీక్షలు నిర్వహించిన నాయకుడు, మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకులు చామకూర భద్రారెడ్డి అని మేడ్చల్ మున్సిపల్ 4వ వార్డు మాజీ కౌన్సిలర్ తుడుం గణేష్ కొనియాడారు. భద్రారెడ్డి పుట్టినరోజు సందర్భంగా తుడుం గణేష్ ఆధ్వర్యంలో భద్రారెడ్డి ని కలిసి కేక్ కట్ చేయించి, శాలువాతో, గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా పూడూరు – కిస్టాపూర్ డివిజన్ కిస్టాపూర్ లోని ప్రాథమిక పాఠశాల లో విద్యార్థులతో కలిసి పుట్టినరోజు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్కలను, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుడుం గణేష్ మాట్లాడుతూ తండ్రి మల్లారెడ్డి కి తనయుడిగా సేవాభావంతో ముందుకు పోతున్న నాయకుడు భద్రారెడ్డి అని కొనియాడారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఎంతోమందికి వైద్య సేవలు అందించారని గుర్తు చేశారు. అటు బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడిగా పార్టీ అభివృద్ధి కి కృషి చేశారన్నారు. ఈరోజు పూడూర్ కిష్టాపూర్ కార్పొరేషన్ పరిధిలో కిష్టాపూర్ లో ప్రైమరీ స్కూల్లో ఈరోజు మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ డాక్టర్ భద్రారెడ్డి గారి పుట్టినరోజు సందర్భంగా స్కూల్లో పిల్లలకు బుక్స్ పంపిణీ పెన్నులు బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా కేక్ కట్ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమార్, సాయి గౌడ్, కాశి, శ్యామ్, నరసింహ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో క్రాంతి యూత్ గణపతి నవరాత్రి ఉత్సవాలు

– గణనాథుని దర్శించుకున్న బీజేపీ, కాంగ్రెస్ నాయకులు.. అతిథులకు ఘన సన్మానం



**కీసర (ప్రశ్న న్యూస్)** బండ్లగూడ ఠాకూర్ కాలనీలో క్రాంతి యూత్ అసోసియేషన్ (స్థాపన: 1984) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 42వ గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సెప్టెంబర్ 23న పలువురు రాజకీయ ప్రముఖులు ఉత్సవాల్లో పాల్గొని గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకట్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర పంచాయతీరాజ్ సెల్ కన్వీనర్ మునిగంటి సురేష్, మున్సిపాలిటీ కాంగ్రెస్ డివిజన్–4 అధ్యక్షుడు ముప్పా రామారావు గణనాథుని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా క్రాంతి యూత్ అసోసియేషన్ సభ్యులు ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. 42 ఏళ్లుగా సంప్రదాయబద్ధంగా గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్న క్రాంతి యూత్ అసోసియేషన్ సేవలను పలువురు అభినందించారు. కార్యక్రమంలో క్రాంతి యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.

# గౌడవల్లిలో నూతన డిజిటల్ రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ

## – లబ్ధిదారుల్లో ఆనందం



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** మేడ్చల్-మల్కాజ్ గిరి జిల్లా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ గుండ్ల పోచంపల్లి డివిజన్ పరిధిలోని గౌడవల్లి గ్రామంలోని చౌక ధరల దుకాణం వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన డిజిటల్ రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పౌర సరఫరాల శాఖ అధికారి అభిషేక్ , రేషన్ షాప్ డీలర్ కైరంకొండ శ్రీనివాస్,ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాలకుర్తి మురళి గౌడ్, దాసరి శంకర్ యాదవ్, శంకూర్ హరి శంకర్ సింగిరెడ్డి రఘుపతి రెడ్డి గువ్వ సురేష్ ముదిరాజ్, సమక్షంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గౌడవల్లి మాజీ సర్పంచ్, గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గరిసెల సురేందర్ ముదిరాజ్ , జిల్లా ఓబీసీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవి ముదిరాజ్ , మాజీ సర్పంచ్ కోరని భగవాన్ దాస్ , గౌడవల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్ వినోద్ గౌడ్ , రాజు గౌడ్ ,దాసరి గణేష్ యాదవ్, రమేష్ గౌడ్, నాగులూరి సుధాకర్, తదితరులతో కలిసి లబ్ధిదారులకు స్వయంగా కార్డులు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనతో తీసుకొచ్చిన డిజిటల్ స్మార్ట్ కార్డు వల్ల అక్రమాలు అరికట్టబడి, నిజమైన లబ్ధిదారునికి రేషన్ అందుతుందన్నా రు. గౌడవల్లిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డు అందేలా చూస్తామని . ఎవరైనా మిగిలిపోతే మీ సేవలోదరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, గ్రామ కాంగ్రెస్ నాయకులు, మహిళాలు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ‘ది ప్యారడైజ్’ - మూవీ రివ్యూ!



నాని అంటే తెరపై పద్ధతి గల కుర్రాడు .. మన పక్కింటి కుర్రాడు .. మనందరికీ పరిచయం ఉన్న కుర్రాడు అనే అందరూ చెప్పుకుంటారు. అలా అందరూ ‘మన’ అనుకున్న కారణంగానే, ఫ్యామిలీస్ తో కలిసి నాని సినిమాలకి వెళుతూ ఉంటారు. నాని కథల పట్ల .. ఆయన ఎంచుకునే పాత్రల పాటల ఆడియన్స్ కి ఉన్న నమ్మకం అలాంటిది మరి. అలాంటి నాని ఈ సారి కాస్త డిఫరెంట్ గా ప్రేక్షకుల ముందుకు వెళ్లాలనే ఆలోచనతో చేసిన సినిమానే ‘ది ప్యారడైజ్’. గతంలో ‘దసరా’ సినిమాతో తనకి హిట్ ఇచ్చిన శ్రీకాంత్ ఓదెలతో కలిసి ఆయన చేసిన ఈ సినిమా, ఈ రోజునే థియేటర్లకు వచ్చింది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని ‘ప్యారడైజ్’ ప్రాంతంలో, సంచారీ జాతికి చెందిన ప్రజలు నివసిస్తూ ఉంటారు. దాదాపు ఐదువేలమంది జనాభా కలిగిన ఈ జాతి ప్రజలు, ఎలాంటి గుర్తింపు లేకుండా బ్రతుకుతుంటారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా తమకి రాకపోవడం పట్ల తీవ్రమైన అసంతృప్తికి లోనవుతారు. షికంజా మాలిక్ (మోహన్ బాబు) నిరంకుశ పాలనలో బానిసల మాదిరిగా బ్రతకలేక నానా కష్టాలు పడుతుంటారు. సంచారీ తెగ నుంచి తమకి గుర్తింపు కావాలని తొలిసారి గళం విప్పిన ‘సమ్మక్క’ (సోనాలీ కులకర్ణి) కొడుకే ‘జడల్’ (నాని). కొన్ని కారణాల వలన ‘జడల్’కి తల్లి పట్ల కోపం .. అసహ్యం కలుగుతాయి. ఆ సమయంలో షికంజా మాలిక్ తన చేతిపై వేయించిన పచ్చ బొట్టు, తల్లి పట్ల ద్వేషాన్ని మరిచిపోనీయకుండా చేస్తుంది. 14 ఏళ్లపాటు జైలు శిక్షను అనుభవించిన అతను, జైలు నుంచి విడుదలవుతాడు. షికంజా మాలిక్ అంతు చూడాలనే ఉద్దేశంతో ‘ప్యారడైజ్’లో అడుగుపెడతాడు. అప్పటికి షికంజా మాలిక్ కొడుకు ‘విక్రమ్ మాలిక్’ (రాఘవ్ జుయల్), రాజకీయాలలోకి రావడానికి ట్రై చేస్తుంటాడు. క్రూరత్వంలో అతను తండ్రిని మించిన తనయుడిని జడల్ తెలుసుకుంటాడు. ‘ప్యారడైజ్’లో అడుగుపెట్టిన ‘జడల్’ తల్లికి దూరంగా ఉంటూనే, తన జాతి కోసం పోరాడటానికి సిద్ధమవుతాడు. అందుకోసం ముందుగా విక్రమ్ మాలిక్ ను రాజకీయాలలోకి రాకుండా చేయాలని భావిస్తాడు. ‘జడల్’కి తన తల్లిపై కోపం ఎందుకు? షికంజా మాలిక్ ను అంతం చేయాలనే అతని కోరిక నెరవేరుతుందా? సవారీ జాతి గుర్తింపు కోసం అతను చేసే ప్రయత్నం ఫలిస్తుందా? సినిమాలలో అవకాశాలు సంపాదించుకోలేక మద్రాస్ నుంచి తిరిగొచ్చిన సుబ్బలక్ష్మి ( కయాదు లోహర్), ‘జడల్’కి ఎలా దగ్గరవుతుంది? అనేది కథ.చరిత్రలోకి వెళితే తమ జాతి గుర్తింపు కోసం .. స్వేచ్ఛ కోసం .. ఈ రెండింటితో కూడిన జీవితం కోసం పోరాడిన గుంపులు చాలానే కనిపిస్తాయి. అలాంటి ఒక సంచారీ తెగ చుట్టూ, వాళ్లను బానిసలుగానే ఉంచే ఒక నియంత చుట్టూ తిరిగే కథ ఇది. తన తల్లి పోరాటం నీరుగారి పోవటానికి కారణం ఆమె వెనుక బలమైన నాయకుడు లేకపోవడమేనని తెలుసుకున్న ఒక కొడుకు, ఆ జాతికి తాను నాయకుడిగా మారిన వైనమే ఈ సినిమా కథ. ఈ కథ అంతా కూడా 1980లలో నడుస్తుంది. చరిత్రను ఒకసారి పరిశీలన చేస్తే అధికారం .. అహంకారానికి కారణమవుతుంది. అహంకారం అణచివేతకు కావలసిన బలాన్ని పొందుతూ రాక్షసానందాన్ని పొందుతుంది.అలాంటి అణచివేతలో నుంచే ఉద్యమాలు ఊపిరిపోసుకోవడం మొదలవుతుంది. అలాంటి ఈ రెండు అంశాలను కలుపుకుంటూ, ఒకప్పటి హైదరాబాద్ నేపథ్యంలో దర్శకుడు ఈ కథను అల్లుకుంటూ వెళ్లాడు.తన తల్లిని అపార్థం చేసుకున్న ఒక కొడుకు, తనలో తాను అంతర్యుద్ధం చేయడం ఫస్టాఫ్ గా ప్రేక్షకుల ముందుకు వస్తుంది. షికంజా మాలిక్ ఆగడాలు .. దురాగతాలు ఈ భాగంలో పలకరిస్తాయి. ఇక తన తల్లి పట్ల గల అపార్థాలు తొలగిపోవడంతో నాయకుడిగా మారిన కొడుకు కథగా సెకండాఫ్ కొనసాగుతుంది. షికంజా మాలిక్ కుటుంబంపై ‘జడల్’ శంఖం పూరించే సన్నివేశాలు ఈ భాగంలో చోటుచేసుకుంటాయి. తన తల్లి ఆశయం కోసం ఆయుధం పట్టిన ఒక కొడుకు కథగా .. తన జాతికి అవసరమైన గుర్తింపు కోసం పోరాడిన ఒక నాయకుడి కథగా ఈ సినిమాను గురించి చెప్పుకోవచ్చు. ఈ రెండు అంశాలు బలమైన ఎమోషన్స్ కి సంబంధించినవే. కానీ ఆ ఎమోషన్ ను కనెక్ట్ చేయడంలో దర్శకుడు విఫలమయ్యాడని చెప్పచ్చు. ఎమోషనల్ గా కనెక్ట్ కాకపోవడం వలన, భారీ యాక్షన్ ఎపిసోడ్స్ వెనకున్న పెయిన్ కనిపించదు .. రక్తపాతం మాత్రమే రిజిస్టర్ అవుతూ ఉంటుంది. పాత్రలను డిజైన్ చేసిన విషయంలోను లోపాలు కనిపిస్తాయి. ‘జడల్’ పాత్ర గురించి ఒక రేంజ్ లో అనుకుంటూ ఉండగా, షికంజా వచ్చి అతణ్ణి తుక్కుకింద కొట్టేసి వెళతాడు. షికంజా గురించి ఒక రేంజ్ లో ఊహించుకుంటే, ఆ వెంటనే ‘జడల్’ వచ్చి అతని గల్లా పట్టుకుని బెదిరిస్తాడు. ఇక ఇప్పటి నుంచి కనిపించను అన్నట్టుగా మోహన్ బాబు ఎగ్జిట్ తీసుకుంటూ, యంగ్ విలన్ కి ఛాన్స్ ఇవ్వడంలో ఆంతర్యం కూడా మనకి బోధపడదు.తెరపై విలన్ గా మోహన్ బాబు కనిపించగానే ఒక రకమైన ఉత్సాహం కలుగుతుంది. కానీ ఆ ఉత్సాహాన్ని ఎక్కువసేపు ఉండనీయలేదు. ఇక నాని యాక్టింగ్ సంగతి అలా ఉంచితే, ఆ రెండు జడలతో స్టెప్పులు వేయడానికి చాలా అవస్థలు పడ్డాడనిపిస్తుంది. కయాదు లోహర్ .. ఆమె తల్లి పాత్రలు లేకపోవడం వలన, కథకి వచ్చే నష్టం లేదు .. ప్రేక్షకులు పడే బెంగా లేదు. సత్యరాజ్ ఎంట్రీ మరో అనవసరమైన హడావిడి. ఇక రాఘవ్ జుయల్ తన పాత్ర గురించి తానేం అనుకున్నాడో తెలియదు .. ప్రాధాన్యత లేని సంపూ పాత్రను చూస్తే మాత్రం పాపం అనిపిస్తుంది. ఈ సినిమాలో భారీ యాక్షన్ సీన్స్ కి కొదవే లేదు. కాళ్లు .. చేతులు .. తలలు తెగిపడుతూ ఉంటాయి. చేతి వ్రేళ్ల దగ్గర నుంచి తల వరకూ నరుకుతూ వెళ్లడమే. రక్తాభిషేకం .. రక్త తర్పణం అనే మాటలు మనకి తప్పకుండా గుర్తొస్తాయి. మంటల్లో తోసేయడం .. గానుగలో వేసేయడం .. కట్టెలు కొట్టినట్టుగా తలకాయలను కొట్టడం వంటి హింసాత్మక దృశ్యాలు ఉన్నాయి. ఇవన్నీ విలన్ అరాచకాలు అనుకుంటే పొరపాటే .. ఇవన్నీ హీరో వీరోచితాలే. అసలు ఈ సినిమాలో నాని రెండు జడలు ఎందుకు వేసుకున్నాడనేది తెలుసుకోవడానికే చాలా మంది వెళ్లుంటారు. ఆ మాట అతని తల్లి పాత్ర నోటి వెంట విన్నప్పుడు, హీరో అసలు పేరు దాచి దాచి చివర్లో చెప్పినప్పుడు చాలా సిల్లీగా అనిపిస్తాయి. అసలు నాని ఇలాంటి ఒక కథను ఎలా ఒప్పుకున్నాడా అనే ఒక సందేహం థియేటర్ నుంచి ఇంటివరకూ మనతోనే వస్తుంది. సుధాకర్ చెరుకూరి నిర్మాణ విలువలకు వంకబెట్టవలసిన పని లేదు. సాయి ఫొటోగ్రఫీ బాగుంది. అనిరుధ్ కి ఏం తోచిందో ఏమో పాపం .. ఏకబిగిన బాదేశాడు. ఎడిటింగ్ పరంగా చూసుకుంటే ట్రిమ్ చేయవలసిన సీన్స్ .. లేపేయవలసిన సీన్స్ లేకపోలేదు. విలన్ వైపు నుంచి క్లైమాక్స్ ను మరోరకంగా ప్లాన్ చేసి ఉంటే బాగుండేదని అనిపిస్తుంది. మొత్తం మీద రెండు పాటలు .. ‘కేసీఆర్’ లుక్ తో ప్రియదర్శి కనిపించడంతో పాటు, ఒకటి రెండు సీన్స్ ఆకట్టుకుంటాయంతే. ఏదేమైనా ఈ సినిమాను నానీ చేసిన ప్రయోగంగా చూడలేము .. ఇది ఆయన చేసిన సాహసంగానే భావించవలసి ఉంటుంది.

# జీవితాంతం నీవు నా దగ్గరే ఉంటావు

**- విజయ్ దేవరకొండ**



రియల్ లైఫ్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘రణబాలి’ సినీ అభిమానుల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ ‘సింగనమల బొబ్బిలి రణబాలి’గా పవర్‌ఫుల్ పాత్రలో అలరించనుండగా, ఆయనకు జోడీగా రష్మిక ‘జయమ్మ’ పాత్రలో నటిస్తోంది. ఇటీవల విడుదలైన ‘ఏందయ్యా సామీ..’ పాట యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియా వేదికగా విశేష ప్రజాదరణ పొందుతోంది. తాజాగా, ఈ పాటలోని ఒక రొమాంటిక్ క్లిప్‌ను రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ... అతను పూర్తిగా తనకే సొంతమయ్యాడని, కానీ అతనిపై ఉన్న క్రష్ మాత్రం ఏమాత్రం తగ్గలేదని కామెంట్ చేసింది. దీనికి విజయ్ దేవరకొండ రిప్లై ఇస్తూ... “నేను ఎంతో అదృష్టవంతుడిని. నేను జయమ్మని మిస్ అవుతాను కానీ.. జీవితాంతం నువ్వు నా దగ్గరే ఉంటావు” అని ఎంతో ప్రేమగా స్పందించాడు. ఈ సరదా సంభాషణ మరియు వారి మధ్య ఉన్న అనుబంధం చూసి అభిమానులు మురిసిపోతున్నారు. మరోవైపు, ఈ సినిమాకు రాహుల్ సాంకృత్యన్ దర్శకత్వం వహిస్తుండగా... మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.

# ఇక రౌడీ జనార్ధన వంతు!



అగ్ర నటుడు విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు భారీ సినిమాలతో బిజీగా ఉన్నారు. అందులో పీరియాడిక్ చిత్రం ‘రణబాలి’ దసరా కానుకగా అక్టోబర్ 16న ప్రేక్షకులముందుకురానుంది. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ పనుల్ని కూడా పూర్తిచేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఏమాత్ర విరామం లేకుండా తదుపరి చిత్రం ‘రౌడీ జనార్ధన’ సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు విజయ్ దేవరకొండ. ఈ సినిమా కోసం సరికొత్త మేకోవర్‌తో భారీ యాక్షన్ సీక్వెన్స్ కోసం ఆయన సిద్ధమవుతున్నట్లు తెలిసింది. రవికిరణ్ కోలా దర్శకత్వంలో దిల్‌రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కోస్తా తీరంలోని కళింగపట్నం నేపథ్యంలో రాజకీయాలు, ఆధిపత్య పో రు, విధేయత ప్రధానాంశాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

# ‘సిగ్మా’ ప్రీ రిలీజ్ ఈవెంట్..

**చీఫ్ గెస్టుగా చిరంజీవి**





యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న తాజా చిత్రం ‘సిగ్మా’ ప్రమోషన్ కార్యక్రమాలు ఊపందుకున్నాయి. రేపు (సెప్టెంబర్ 25) హైదరాబాద్‌లో జరగనున్న ‘సిగ్మా’ ప్రీ రిలీజ్ వేడుకకు టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అధికారికంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. మెగాస్టార్ రాకతో సినిమాకు భారీ హైప్ వచ్చినట్టయింది. ఈ సినిమాకు ఉన్న మరో ప్రధాన ఆకర్షణ ఏంటంటే.. తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ ఈ చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేస్తున్నాడు. తన తొలి సినిమాతోనే అతడు తెలుగు ప్రేక్షకులను పలకరించనుండటం విశేషం. హైదరాబాద్‌లోని పార్క్ హయత్‌లో శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో సందీప్ కిషన్‌కు జోడీగా ‘జాతిరత్నాలు’ ఫేమ్ ఫరియా అబ్దుల్లా నటిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా పంపిణీ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సొంతం చేసుకోవడం సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ‘సిగ్మా’ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న తరుణంలో, మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా వస్తుండటంతో ఈ ఈవెంట్ సినిమాకు కావాల్సినంత ప్రచారాన్ని అందిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ‘జార్జ్‌క్రిష్’లో మానస



”‘దేవకి నందన వాసుదేవ’ చిత్రంతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది హైదరాబాద్ సొగసరి మానస వారణాసి. ‘కపుల్‌ఫ్రెండ్లీ’ సినిమా ద్వారా యువతరానికి చేరువైంది. తాజాగా ఈ భామ తెలుగులో భారీ ఆఫర్‌ను దక్కించుకుంది. శర్వానంద్ నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘జార్జ్‌క్రిష్’లో ఆమెను కథానాయికగా ఖరారు చేశారు. డిక్షనరీలు శోధించండి శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. కథాగమనంలో మానస వారణాసి పాత్ర చాలా కీలకంగా ఉంటుందని, శర్వానంద్‌తో ఆమె ప్రేమాయణం ఆద్యంతం ఆసక్తిగా సాగుతుందని మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. సంక్రాంతికి విడుదలకానుంది.

# దసరాకు ముహూర్తం



ఈ ఏడాది ‘పెద్ది’ చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకున్నారు అగ్ర హీరో రామ్‌చరణ్. ప్రస్తుతం ఆయన సుకుమార్ దర్శకత్వంలో తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. ‘రంగస్థలం’వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత రామ్‌చరణ్-సుకుమార్ కాంబోలో రాబోతున్న ఈ సినిమాపై భారీ హైప్ నెలకొని ఉంది. ఈ సినిమాలో రామ్‌చరణ్ స్టైలిష్ లుక్స్‌లో కనిపిస్తారని, అర్బన్ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా ఇదని సమాచారం. ఈ సినిమా కోసం రామ్‌చరణ్ 15కిలోల బరువు తగ్గి స్లిమ్‌గా కనిపించబోతున్నారట. తాజా సమాచారం ప్రకారం దసరా సందర్భంగా అక్టోబర్ 20న ఈ సినిమాను లాంఛనంగా ప్రారంభించబోతున్నారని తెలిసింది. ‘ఆర్‌సీ17’అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ తెరకెక్కించబోతున్నాయి.

# ఉద్యోగాలిస్తే ఓర్వలేరా.?

- డీఎస్సీ నియామకాలపై రాద్ధాంతం
- శాప్ వద్ద దాడులపై హోంమంత్రి అనిత ఆగ్రహం
- 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశాం
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే ఉపేక్షించం




**అమరావతి(ప్రశ్న న్యూస్)** యువతకు ఉద్యోగాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. రాజకీయ ప్రయోజనాల కోసం యువతను రెచ్చగొట్టి రౌడీయిజానికి ప్రోత్సహించడం వైసీపీ విధానమని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. డీఎస్సీ నియామకాలపై ప్రతిపక్షం చేస్తున్న విమర్శలను ఆమె తీవ్రంగా ఖండించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.

### 16 వేలకుపైగా పోస్టులు

యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారా లోకేశ్ న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి ఉపాధ్యాయ నియామకాలను పారదర్శకంగా చేపట్టారని అనిత తెలిపారు. డీఎస్సీ ద్వారా 16 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరిగిందని చెప్పారు. నియామక విధానంపై అసెంబ్లీలో వివరాలు వెల్లడించడంతో పాటు బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ చేశారని పేర్కొన్నారు.

### శాప్ వద్ద ఏం జరిగింది?

కడపలో క్రీడా కోటా కింద ఎంపికైన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలతో విజయవాడలోని శాప్ కార్యాలయానికి వచ్చారని హోం మంత్రి తెలిపారు. అక్కడ జరిగిన నిరసన సందర్భంగా కొందరు వ్యక్తులు రాళ్లు, గాజు సీసాలు, ఇనుప రాడ్లతో దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఘటనకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, కేసుల వివరాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు.
నిరసనల్లో పాల్గొన్న వారిలో కొందరికి నేరచరిత్ర ఉందని అనిత ఆరోపించారు. వారిని సాధారణ విద్యార్థులుగా చిత్రీకరించి రాజకీయంగా ఉపయోగించుకునే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అయితే వ్యక్తులపై నమోదైన కేసులు, వాటి ప్రస్తుత న్యాయస్థితి వంటివి అధికారిక రికార్డుల ఆధారంగానే నిర్ధారించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

### గత పాలనపైనా విమర్శలు


గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ పరీక్షలు, మద్యం విధానం తదితర అంశాలపై వచ్చిన ఆరోపణలపై జగన్ ఎందుకు స్పందించడం లేదని అనిత ప్రశ్నించారు. వాటి నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎస్సీపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.ఉపాధ్యాయులను గతంలో మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టారని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఉపాధ్యాయులకు గౌరవం ఇస్తోందన్నారు.

### 'రౌడీయిజంపై ఉక్కుపాదం'

రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని హోం మంత్రి తెలిపారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, విద్యార్థులపై దాడులకు పాల్పడితే చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగుపడటంతో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. యువత భవిష్యత్తును రాజకీయ వివాదాల్లోకి లాగకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# పెట్టుబడులకు 'పంచ' పథకం

- ఐదు ప్రాంతాల్లో రీజినల్ కాన్ఫరెన్సులు
- 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన



**అమరావతి(ప్రశ్న న్యూస్)** రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిచ్చేలా 'పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్--2026'ను నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది. నవంబరు 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ముందు రాష్ట్రంలోని ఐదు ప్రాంతాల్లో రీజినల్ కాన్ఫరెన్సులు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, అనంతపురం, తిరుపతిలో జరిగే ఈ సదస్సుల్లో ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, పెట్టుబడి అవకాశాలపై దృష్టి సారించనున్నారు.

### ఐదు నగరాలు.. ఐదు రంగాలు

అక్టోబరు 7న విశాఖలో ఏఐ, డేటా సెంటర్లు, ఐటీ--ఫిన్‌టెక్, సెమీకండక్టర్లు, జీసీసీ, ఫార్మా, మెడ్‌టెక్ రంగాలపై సదస్సు జరగనుంది.అక్టోబరు 12న కాకినాడలో మారిటైమ్, షిప్‌బిల్డింగ్, కెమికల్స్, గ్రీన్ హైడ్రోజన్, అమోనియా, ఆక్వా ఎగుమతులు, ఫుడ్ ప్రాసెసింగ్‌పై చర్చిస్తారు.అక్టోబరు 16న గుంటూరులో గవర్నెన్స్, రాజధాని అభివృద్ధి, అర్బన్ ఇన్‌ఫ్రా, క్వాంటం వ్యాలీ, ఎమర్జింగ్ టెక్నాలజీలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అక్టోబరు 23న అనంతపురంలో ఏరోస్పేస్, డిఫెన్స్, ఆటోమోటివ్, ప్రకృతి వ్యవసాయం, ఉద్యానవనాలు, ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధన రంగాలపై దృష్టి సారిస్తారు. అక్టోబరు 26న తిరుపతిలో పర్యాటకం, ఆతిథ్యం, ఎలక్ట్రానిక్స్ తయారీ, సెమీకండక్టర్లు, అధునాతన మెటీరియల్స్, ఆటోమోటివ్, స్పేస్, ఫుట్‌వేర్ రంగాలకు ప్రాధాన్యం ఉంటుంది.

### సదస్సులోనే ఎంవోయూలు

ఈసారి రీజినల్ కాన్ఫరెన్సుల్లోనే పెట్టుబడుల ఎంవోయూలు కుదిరేలా విధానంలో మార్పులు చేశారు. ప్రధాన ప్రాజెక్టులకు సంబంధించిన ఎంవోయూలను మాత్రం విశాఖలో జరిగే ప్రధాన సదస్సులో చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. సదస్సు కేవలం ఎంవోయూలకే పరిమితం కాకుండా పెట్టుబడులు, సాంకేతికత, పారిశ్రామిక అభివృద్ధి తదితర అంశాలపై చర్చలకు వేదిక కావాలని సీఎం సూచించారు.

### 'షార్క్ ట్యాంక్' తరహాలో

ప్రతి రీజినల్ కాన్ఫరెన్స్‌లో ఎంఎస్ఎంఈ షోకేస్ నిర్వహించాలని చంద్రబాబు సూచించారు. స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టేవారిని ఆకర్షించేందుకు 'షార్క్ ట్యాంక్' తరహా విధానాన్ని ప్రవేశపెట్టాలని చెప్పారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లను రీజినల్ కాన్ఫరెన్సులకు అనుసంధానించాలని ఆదేశించారు.భాగస్వామ్య సదస్సుకు ముందే మరో 30 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేయాలని స్పష్టం చేశారు. ఏడో తరగతి నుంచే విద్యార్థుల్లో పారిశ్రామిక ఆలోచనలు పెంపొందించేలా పాఠ్యాంశాలను రూపొందించాలని, పాఠశాల స్థాయి నుంచే స్టార్టప్ ఆలోచనలను ప్రోత్సహించాలని సూచించారు.

# ముంపు ప్రాంతాల్లో పల్లా పర్యటన

- వర్షాల పరిస్థితిని పరిశీలించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు
- ప్రజలతో మమేకం.. సమస్యలపై ఆరా అధికారులు సహాయక చర్యలు ముమ్మరం చేయాలి



**విశాఖపట్నం(ప్రశ్న న్యూస్)** వాయుగుండం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ముంపు, లోతట్టు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. పెద్దగంట్యాడ, గంగవరం, హరిజన జగ్గయ్యపాలెం, నీలపువీధి, హౌసింగ్ బోర్డు కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.డ్రైనేజీలు పొంగిపొర్లుతున్న ప్రాంతాలను పరిశీలించిన పల్లా.. నీటి నిల్వలు, పారుదల పరిస్థితులపై అధికారులను ఆరా తీశారు. ముంపు సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

**అప్రమత్తంగా ఉండాలి** భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పల్లా సూచించారు. పొంగిపొర్లుతున్న డ్రైనేజీలు, కాలువలు, నీటి ప్రవాహాల వద్దకు వెళ్లవద్దని కోరారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా జీవీఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు.అవసరమైన చోట సహాయక చర్యలను వేగవంతం చేయాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు.

**ప్రజలకు అండగా నిలవాలి** టీడీపీ నాయకులు, కార్యకర్తలు ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని పల్లా పిలుపునిచ్చారు. అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. వర్షాలు తగ్గే వరకు ముంపు ప్రాంతాల్లో పరిస్థితులను పర్యవేక్షిస్తూ ప్రజలకు అండగా నిలవాలని కోరారు.

### ఆహుతులను అలరించిన

# కూచిపూడి నృత్య ప్రదర్శన



బడంగ్ పేట్ (ప్రశ్న న్యూస్) వినాయక నవరాత్రుల్లో భాగంగా శ్రీసాయిబాలాజీ హోమ్స్ పేస్ 2, కమ్యూనిటీ హాల్ లో ప్రతిష్టించిన గణనాథుని మండపంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ప్రతి రోజు సాయంత్రం మండపంలో సాయంకాలం పూజలో భాగంగా గణపతి హోమం, కుంకుమార్చన, అన్నప్రసాద వితరణ వంటి కార్యక్రమాలను నిర్విఘ్నంగా నిర్వహించారు. అలాగే మండపం వద్ద నిర్వహిస్తున్న పలు సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మంగళవారం నాడు సృజనరంజని కళానిలయం శిష్య బృందంలోని కాలనీ కి చెందిన చిన్నారులచే చేయబడిన కూచిపూడి నృత్య కళా ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా శ్రీసాయిబాలాజీ హోమ్స్ పేస్ 2 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రాందాస్ నాయక్, ఉపాధ్యక్షులు శ్రీరామచంద్ర శర్మ మాట్లాడుతు కూచిపూడి నృత్యం ప్రదర్శనలో చిన్నారులు కనబరిచిన ప్రతిభ అద్వితీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్ని చిన్నారుల నృత్యాన్ని తిలకించిన ఆహుతులు చిన్నారులను అభినందించారు.

# వర్షం... కొండపై నిఘా

- ఇంద్రకీలాద్రిపై ఈవో శీనా నాయక్ క్షేత్రస్థాయి పరిశీలన
- కొండచరియలు, రిటైనింగ్ వాల్ పటిష్టతపై ప్రత్యేక దృష్టి
- భక్తుల భద్రతకు ప్రాధాన్యం,స్టోర్స్‌ను అన్నదాన భవన్ సెల్లార్‌కు తరలించాలని ఆదేశం

**విజయవాడ(ప్రశ్న న్యూస్)** అకాల వర్షాలతో ఇంద్రకీలాద్రిపై అప్రమత్తత పెరిగింది. తుఫాను ప్రభావంతో విజయవాడలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండచరియలు విరిగిపడే ప్రాంతాలు, ఘాట్ రోడ్డు రిటైనింగ్ వాల్స్, డ్రైనేజీ వ్యవస్థపై దేవస్థానం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భక్తుల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ ఆదేశించారు. గురువారం సాయంత్రం ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఈవో ఇంద్రకీలాద్రిపై విస్తృతంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. శ్రీ అమ్మవారి ప్రధాన ఆలయ ప్రాంగణం నుంచి తనిఖీలను ప్రారంభించి చిన్న రాజగోపురం, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, నటరాజస్వామి ఆలయ పరిసరాలను పరిశీలించారు.

**కొండచరియలపై నిఘా** అనంతరం ఘాట్ రోడ్డుపై కాలినడకన ఓం టర్నింగ్ ప్రాంతానికి చేరుకున్న ఈవో.. కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న సున్నిత ప్రాంతాలను పరిశీలించారు. రిటైనింగ్ వాల్స్ పటిష్టత, ఇనుప రక్షణ వలలు, గతంలో కొండచరియలు జారిన ప్రాంతాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.వర్షాల కారణంగా కొండపై నుంచి మట్టి, రాళ్లు, కొండచరియలు జారిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు. రిటైనింగ్ వాల్స్, రక్షణ వలలను ఇంజినీరింగ్ సిబ్బంది తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. రాళ్లు, మట్టి లేదా వర్షపు నీరు ఘాట్ రోడ్డుపైకి చేరకుండా అవసరమైన సహాయక చర్యలను సిద్ధంగా ఉంచాలని స్పష్టం చేశారు.

**నీరు నిలవకుండా చర్యలు** ఘాట్ రోడ్డులో కొనసాగుతున్న మరమ్మతు పనుల పురోగతిని ఈవో పరిశీలించారు. వర్షపు నీరు రోడ్డుపై నిలిచిపోకుండా డ్రైనేజీ వ్యవస్థ ద్వారా వేగంగా దిగువకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కనకదుర్గనగర్ ప్రాంతంలో కొండపై నుంచి వచ్చే వర్షపు నీరు నిలిచిపోకుండా ఏర్పాటు చేసిన డ్రైనేజీ అవుట్‌లెట్లను కూడా పరిశీలించారు. పారిశుధ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు పూడికతీత చేపట్టాలని సూచించారు.

**స్టోర్స్ తరలింపునకు ఆదేశం** నూతనంగా నిర్మించిన అన్నదాన భవనాన్ని సందర్శించిన ఈవో అక్కడ కూడా పలు సూచనలు చేశారు. ప్రస్తుతం మహామండపం ఆరో అంతస్తులో కొనసాగుతున్న దేవస్థాన ప్రధాన స్టోర్స్ విభాగాన్ని పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా కొత్త అన్నదాన భవనం సెల్లార్‌లోని విశాలమైన ప్రాంగణానికి తక్షణమే తరలించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

**దసరా ఉత్సవాల దృష్ట్యా అప్రమత్తం** రాబోయే దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని వర్షాల సమయంలో కొండపై ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని ఈవో శీనా నాయక్ సూచించారు. భక్తుల రాకపోకలకు ఆటంకం కలగకుండా ఇంజినీరింగ్, శానిటేషన్ విభాగాలు సమన్వయంతో నిరంతరం విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో దేవస్థాన ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎల్. రమ, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# మచిలీపట్నంలో 'షిప్‌యార్డ్'

- రూ.8 వేల కోట్ల పెట్టుబడి
- 400 ఎకరాల్లో గోవా షిప్‌యార్డ్.. 10 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి
- రెండేళ్లలో ఉత్పత్తి ప్రారంభించేలా ఏర్పాట్లు: మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం(ప్రశ్న న్యూస్)** మచిలీపట్నం పారిశ్రామిక చరిత్రలో మరో కీలక ముందడుగు పడింది. గోవా షిప్‌యార్డ్ సంస్థ రూ.8 వేల కోట్ల పెట్టుబడితో 400 ఎకరాల్లో భారీ నౌకా నిర్మాణ పరిశ్రమ ఏర్పాటు చేయనుంది. యుద్ధ నౌకలు, కోస్ట్‌గార్డ్ పడవలు, ఇతర నౌకలను నిర్మించే ఈ ప్రాజెక్టుతో సుమారు 10 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. అనుబంధ పరిశ్రమల ద్వారా మరో రూ.3 వేల--రూ.4 వేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు మచిలీపట్నం ఆర్అండ్‌బీ అతిథిగృహంలో గురువారం ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి వివరాలు వెల్లడించారు. పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, మౌలిక వసతులను వేగంగా కల్పించి రెండేళ్లలో ఉత్పత్తి ప్రారంభించేలా ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారుమచిలీపట్నానికి వందల ఏళ్లుగా నౌకా నిర్మాణ చరిత్ర ఉందని మంత్రి పేర్కొన్నారు. కొంతకాలంగా నిలిచిపోయిన నౌకా నిర్మాణ కార్యకలాపాలు మళ్లీ ఊపందుకోనున్నాయని చెప్పారు. గోవా షిప్‌యార్డ్ రాక మచిలీపట్నానికి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు మరిన్ని పరిశ్రమలు, పెట్టుబడులకు నాంది కానుందని తెలిపారు.గతంలో ప్రాజెక్టుపై అనిశ్చితి నెలకొన్నప్పటికీ మంత్రి నారా లోకేశ్ చొరవతో గోవా షిప్‌యార్డ్ తిరిగి మచిలీపట్నానికి రావడం సాధ్యమైందని చెప్పారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారుమచిలీపట్నం పోర్టు అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి తెలిపారు. బెర్తుల నిర్మాణం పూర్తయిందని, డ్రెడ్జింగ్ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. పోర్టు--షిప్‌యార్డ్--అనుబంధ పరిశ్రమలతో మచిలీపట్నం భవిష్యత్తులో కీలక పారిశ్రామిక కేంద్రంగా ఎదగనుందని పేర్కొన్నారు.ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ గోవా షిప్‌యార్డ్ మచిలీపట్నం అభివృద్ధికి తొలి అడుగుగా నిలుస్తుందన్నారు. పోర్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఆయిల్ రిఫైనరీలు, ఎడిబుల్ ఆయిల్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, కంటైనర్ ఆధారిత పరిశ్రమలు అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. మచిలీపట్నం--అవనిగడ్డ మధ్య పారిశ్రామిక అభివృద్ధికి అనుకూల ప్రాంతాలను వినియోగించుకోవచ్చని తెలిపారు.

# స్కూల్ బస్సులు పసుపు రంగులోనే ఎందుకు.?

## పిల్లల భద్రత వెనుక దాగి ఉన్న ఓ శాస్త్రీయ కారణం ఏమిటి.?

**హైదరాబాద్( ప్రశ్న న్యూస్ )** స్కూల్ బస్సు కనిపించగానే మన కళ్లకు ముందుగా కనిపించేది దాని పసుపు రంగు. కానీ స్కూల్ బస్సులకు పసుపు రంగే ఎందుకు వేస్తారు.? ఇది కేవలం అందం కోసం తీసుకున్న నిర్ణయం కాదు. పిల్లల భద్రతను దృష్టిలో పెట్టుకుని శాస్త్రీయ పరిశీలనల ఆధారంగా ఏర్పడిన రంగు ఎంపిక ఇది. పసుపు రంగు పగటి సమయంలోనే కాకుండా తక్కువ వెలుతురు, వర్షం, పొగమంచు వంటి పరిస్థితుల్లో కూడా ఇతర రంగులతో పోలిస్తే సులభంగా గుర్తించడానికి సహాయపడుతుంది. ముఖ్యంగా మన పక్క చూపు (పెరిఫెరల్ విషన్ )లో కూడా పసుపు రంగు త్వరగా దృష్టిని ఆకర్షించే రంగుల్లో ఒకటి.



### పసుపు-నలుపు కలయిక ఎందుకు..

స్కూల్ బస్సులపై సాధారణంగా పసుపు నేపథ్యంపై నలుపు అక్షరాలు ఉపయోగిస్తారు. పసుపు, నలుపు మధ్య ఉండే అధిక కాంట్రాస్ట్ కారణంగా అక్షరాలు దూరం నుంచే స్పష్టంగా కనిపించే అవకాశం ఉంటుంది. బస్సు వెనుక, ముందు భాగాల్లో హెచ్చరిక సూచనలు, స్కూల్ బస్సు గుర్తింపులు స్పష్టంగా ఉండటం వల్ల ఇతర వాహనదారులు బస్సును త్వరగా గుర్తించి అప్రమత్తం కావచ్చు.

### ఈ ఆలోచనకు అమెరికాలోనే బీజం..

స్కూల్ బస్సుల రంగు విషయంలో అమెరికాలో 1930లలోనే ప్రమాణీకరణపై చర్చలు జరిగాయి. 1939లో నిర్వహించిన విద్యా రవాణా సంబంధిత సమావేశంలో పసుపు రంగును స్కూల్ బస్సులకు అనుకూలమైన రంగుగా గుర్తించే దిశగా నిర్ణయాలు తీసుకున్నారు. ఆ తర్వాత ఈ రంగు స్కూల్ బస్సుల భద్రతకు సంబంధించిన గుర్తింపుగా విస్తృతంగా ఉపయోగించబడింది.

### రంగు మాత్రమే కాదు... భద్రతే అసలు విషయం

స్కూల్ బస్సు పసుపు రంగులో ఉండటం వల్ల ప్రమాదాలు పూర్తిగా నివారించబడతాయని కాదు. అయితే బస్సు త్వరగా గుర్తించబడటం, ఇతర వాహనదారులు అప్రమత్తం కావడం, పిల్లలను తీసుకెళ్తున్న వాహనం అని సులభంగా అర్థం కావడం వంటి అంశాల్లో ఈ రంగు సహాయపడుతుంది. అందుకే స్కూల్ బస్సు పసుపు రంగు కేవలం ఒక రంగు కాదు...

### అది పిల్లల భద్రతకు సంబంధించిన ఒక ముఖ్యమైన గుర్తింపు.

రోడ్డుపై పసుపు రంగు స్కూల్ బస్సు కనిపించినప్పుడు వేగం తగ్గించడం, తగిన దూరం పాటించడం, పిల్లలు ఎక్కుతున్నా - దిగుతున్నా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి వాహనదారుడి బాధ్యత.

# తొందరపాటు పెళ్లి ... జీవితానికే చీకటి

- ప్రభుత్వ ఉద్యోగం ఉందనే ఒక్క కారణంతో మిగతా విషయాలను ఎందుకు విస్మరిస్తున్నాం.?- చదువుకుంటున్న పిల్లలపై పెళ్లి ఒత్తిడి ఎందుకు.?
- సంబంధం ఖరారు చేసే ముందు అబ్బాయి కుటుంబం గురించి పూర్తిగా ఎందుకు తెలుసుకోవడం లేదు.? -పిల్ల అభిప్రాయానికి పూర్తి స్వేచ్ఛ ఎందుకు ఇవ్వడం లేదు.?
- పెళ్లి తర్వాత ఆమె చదువు, ఉద్యోగం కొనసాగుతుందా అనే విషయాన్ని ముందుగానే ఎందుకు చర్చించడం లేదు.?
- కట్నం, కానుకల విషయంలో స్పష్టత లేకుండా సంబంధాలను ఎందుకు ఖరారు చేస్తున్నాం.?- ప్రభుత్వ ఉద్యోగం ఉంది అనే ఒక్క మాటకు పిల్లల భవిష్యత్తును తాకట్టు పెడుతున్నామా.?

(ప్రత్యేక కథనం, ప్రజాప్రశ్న మేడ్చల్ ప్రతినిధి చిన్నా)

"పెళ్లి చేయడం తల్లిదండ్రులబాధ్యత కావచ్చు కానీ ఆ పెళ్లి తర్వాత తమ పిల్ల సురక్షితంగా గౌరవంగా తన ఆశయాలతో జీవించేలా చూడటం కూడా అంతే ముఖ్యమైన బాధ్యత ఒక మంచి సంబంధం కోసం తొందర పడకండి, ఒక మంచి జీవితాన్ని నిర్మించే నిర్ణయం తీసుకోండి.చదువు విలువ ఇవ్వండి సంబంధం కంటే జీవితాన్ని ముందుగా చుడండి ఉదాహరణకు :మేడ్చల్ జిల్లాఘట్కేసర్ పరిధిలో పల్లవి ఘటన మరోసారి ఆలోచింపజేస్తుంది"

ప్రభుత్వ ఉద్యోగం ఉందని మాత్రమే సంబంధాన్ని ఖరారు చేయొద్దు ప్రభుత్వ ఉద్యోగం ఉండటం ఒక మంచి అర్హత కావచ్చు. కానీ అదే వ్యక్తి మంచి జీవిత భాగస్వామి అవుతాడనే హామీ మాత్రం కాదు. వ్యక్తి స్వభావం, ఆలోచనా విధానం, కుటుంబ నేపథ్యం, బాధ్యతాయుతమైన ప్రవర్తన, మహిళల పట్ల గౌరవం వంటి అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగం చూసి మిగతా విషయాలను విస్మరించడం భవిష్యత్తులో సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంది.

### పిల్లల చదువుకంటే పెళ్లి ముఖ్యమా.?

ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో అమ్మాయి చదువుకుంటున్న సమయంలోనే పెళ్లి సంబంధాల కోసం తొందరపడుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా మంచి ఉద్యోగం ఉన్న సంబంధం వచ్చిందంటే చదువును మధ్యలోనే ఆపేయాలనే ఆలోచన కొందరిలో కనిపిస్తుంది. అయితే విద్య అనేది అమ్మాయి జీవితానికి బలమైన పునాది. ఆమె చదువు, కెరీర్, భవిష్యత్తు లక్ష్యాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకోవడం కుటుంబ బాధ్యత.

### ఇలాంటి సంబంధం మళ్లీ రాదు, అనే భయం వద్దు

ఇంత మంచి సంబంధం మళ్లీ రాదు,అబ్బాయికి ప్రభుత్వ ఉద్యోగం ఉంది, ఇప్పుడు వదిలేస్తే తర్వాత ఇలాంటి సంబంధం దొరకదు అనే మాటలు తల్లిదండ్రులను తొందరపాటు నిర్ణయాల వైపు నడిపించవచ్చు. కానీ పెళ్లి అనేది ఒకరోజు కార్యక్రమం కాదు. జీవితాంతం కొనసాగాల్సిన బంధం. అందుకే సంబంధం పోతుందనే భయంతో కాకుండా, సంబంధం నిజంగా సరైనదేనా అనే విషయాన్ని పరిశీలించడం ముఖ్యం.

### పెళ్లికి ముందు అబ్బాయి గురించి పూర్తిగా తెలుసుకోవాలి

అబ్బాయి ఉద్యోగం, జీతం మాత్రమే కాకుండా అతని స్వభావం, స్నేహాలు, అలవాట్లు, కుటుంబ సంబంధాలు, ఆర్థిక పరిస్థితులు, అప్పులు, బాధ్యతల పట్ల వైఖరి వంటి అంశాలను తెలుసుకోవాలి. పెళ్లి తర్వాత బయటపడే విషయాల కంటే ముందుగానే వాస్తవ పరిస్థితులను తెలుసుకోవడం కుటుంబాలకు ఎంతో ఉపయోగకరం.

### అమ్మాయి చదువు, ఉద్యోగంపై భవిష్యత్తు కుటుంబం అభిప్రాయం ఏమిటి.?

అమ్మాయి చదువు కొనసాగించాలనుకుంటే అంగీకరిస్తారా.? ఉద్యోగం చేయాలనుకుంటే ప్రోత్సహిస్తారా.? ఆమెకు తన కెరీర్‌పై నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఉంటుందా.? పెళ్లికి ముందే ఇలాంటి విషయాలపై స్పష్టమైన అవగాహన ఉండాలి. పెళ్లి తర్వాత అభిప్రాయాలు మారకుండా ముందుగానే కుటుంబాల మధ్య స్పష్టత ఉండటం అవసరం.

### కట్నం, కానుకల విషయంలో వారి ఆలోచన తెలుసుకోవాలి

కట్నం, కానుకలు, వివాహ ఖర్చులు వంటి అంశాలపై పెళ్లికి ముందే స్పష్టత అవసరం. డబ్బు, ఆస్తి, కానుకల కోసం ఒత్తిడి చేసే పరిస్థితులు ఉన్నాయా అనే విషయాన్ని కూడా కుటుంబాలు గమనించాలి. కట్నం పేరుతో వేధింపులు చట్టపరంగానూ, సామాజికంగానూ తీవ్రమైన అంశం.



### పల్లవి ఘటన మరోసారి ఆలోచింపజేస్తోంది



మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ పరిధిలో ఇటీవల చోటుచేసుకున్న పల్లవి ఘటనపై వార్తలు సమాజంలో తీవ్ర చర్చకు దారితీశాయి. వార్తల ప్రకారం యాదాద్రి-భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన పల్లవి బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. ఆగస్టు 30న చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డితో ఆమె వివాహం జరిగినట్లు సమాచారం.పెళ్లైన కొద్ది రోజులకే అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని పల్లవి కుటుంబ సభ్యులకు చెప్పినట్లు వార్తలు వెలువడ్డాయి. సెప్టెంబర్ 18న ఆమె కళాశాలలో ఉండగా తీవ్ర ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఘట్‌కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

### ఉద్యోగం కాదు... వ్యక్తిత్వం కూడా ముఖ్యం

ప్రభుత్వ ఉద్యోగం ఉంది కాబట్టి జీవితం సురక్షితం అనే భావన ఒక్కటే ఆధారంగా పెళ్లి నిర్ణయం తీసుకోవడం సరిపోదు. ఉద్యోగం ఒక అంశం మాత్రమే. జీవిత భాగస్వామిగా వ్యక్తి ఎలా ఉంటాడు.? మహిళను గౌరవిస్తాడా.? ఆమె అభిప్రాయాలను స్వీకరిస్తాడా.? కుటుంబ జీవితంలో బాధ్యతలు పంచుకుంటాడా.? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకోవాలి.

### పిల్ల అభిప్రాయమే కేంద్రంగా ఉండాలి

పెళ్లి విషయంలో తల్లిదండ్రుల నిర్ణయం ముఖ్యమైనదే అయినప్పటికీ, జీవితాంతం ఆ బంధంలో ఉండాల్సింది పిల్లే. అందువల్ల ఆమె అభిప్రాయాన్ని స్వేచ్ఛగా అడగాలి. సంబంధం నచ్చిందా.? ఏమైనా సందేహాలు ఉన్నాయా.? పెళ్లికి సిద్ధంగా ఉందా.? చదువు పూర్తిచేసుకోవాలనుకుంటుందా.? వంటి విషయాలను ఒత్తిడి లేకుండా తెలుసుకోవాలి.

### చదువు పూర్తయ్యే వరకు ఆలోచించాలి

పిల్ల ఇంకా చదువుకుంటుంటే కేవలం సంబంధం వచ్చిందనే కారణంతో చదువును మధ్యలో ఆపేయడం గురించి కుటుంబాలు పునరాలోచించాలి. విద్య పూర్తయితే భవిష్యత్తులో ఆమెకు మరిన్ని అవకాశాలు లభిస్తాయి. తన కాళ్లపై తాను నిలబడే సామర్థ్యం పెరుగుతుంది. అందువల్ల పెళ్లి నిర్ణయంతో పాటు విద్య కొనసాగింపునూ సమానంగా పరిగణించాలి.

### పెళ్లికి ముందు రెండు కుటుంబాల మధ్య స్పష్టమైన చర్చ అవసరం

పెళ్లి తర్వాత సమస్యలు రాకుండా ముందుగానే ముఖ్యమైన అంశాలపై మాట్లాడుకోవాలి. అమ్మాయి చదువు, ఉద్యోగం, నివాసం, కుటుంబ బాధ్యతలు, ఆర్థిక వ్యవహారాలు, కట్నం-కానుకలు వంటి విషయాల్లో రెండు కుటుంబాల అభిప్రాయాలు స్పష్టంగా ఉండాలి. మాటల్లో ఒకటి, పెళ్లి తర్వాత మరొకటి కాకుండా ముందుగానే స్పష్టత ఉండటం అవసరం.

### మంచి సంబంధం పోతుంది కంటే "తప్పు నిర్ణయం తీసుకోకూడదు" అనేది ముఖ్యం

ఒక సంబంధం ఆలస్యమవుతుందనే భయంతో తొందరగా నిర్ణయం తీసుకోవడం కంటే, సంబంధం గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాత నిర్ణయం తీసుకోవడం ముఖ్యం. పెళ్లి తేదీ కంటే జీవిత భాగస్వామి ఎంపిక, పరస్పర గౌరవం, భద్రత, భవిష్యత్తు లక్ష్యాలపై అవగాహన ముఖ్యమైనవి.

### సమాజం ఆలోచనా విధానం మారాలి

అమ్మాయికి పెళ్లెప్పుడు? అనే ప్రశ్నతో పాటు,ఆమె చదువు ఎలా పూర్తిచేస్తుంది?, ఆమె భవిష్యత్తు లక్ష్యం ఏమిటి?, ఆమె తన కాళ్లపై ఎలా నిలబడుతుంది?" అనే ప్రశ్నలు కూడా సమాజంలో వినిపించాలి. ఆడపిల్ల జీవితాన్ని కేవలం పెళ్లితో మాత్రమే ముడిపెట్టకుండా, ఆమె విద్య, వ్యక్తిత్వం, భవిష్యత్తు అవకాశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి.

# బీఆర్ఎస్ ఫామ్‌హౌస్ ఫైల్స్

## - ఆరోపణల హోరు.. దర్యాప్తు ఎందుకు దూరం.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బిఆర్ఎస్ మధ్య ఫామ్‌హౌస్‌లు, అక్రమాస్తుల రగడ తీవ్ర స్థాయికి చేరింది. తెలంగాణ ఉద్యమానికి ముందు సాధారణ మధ్యతరగతి జీవితాలు గడిపిన బిఆర్ఎస్ ముఖ్య నేతలు, పదేళ్ల అధికారంలో విపరీతంగా ఆస్తులు కూడబెట్టారంటూ కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ఫామ్‌హౌస్ ఫైల్స్ పేరిట క్షేత్రస్థాయి యాత్రలు చేపట్టారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న జాన్వాడ, అజీజ్ నగర్, శంషాబాద్ ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌ల వద్దకు వెళ్లి మీడియా ముందు బిఆర్ఎస్ నేతల ఆస్తుల వివరాలను ఎండగట్టడం రాజకీయంగా పెద్ద దుమారమే రేపుతోంది.

### - ఆ నేతలకు ఇలాంటి ఆస్తులెక్కడి నుంచి వచ్చాయి?

ఈ యాత్రల ప్రధాన ఉద్దేశం ప్రజల్లో ఒక బలమైన రాజకీయ విధానాన్ని బదిలీ చేయడమే. ఉద్యమ సమయంలో మామూలు చెప్పులతో తిరిగిన నాయకులు అధికారంలోకి వచ్చాక వేల కోట్ల ఆస్తులు, విలాసవంతమైన విల్లాలు ఎలా సంపాదించారనే అంశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం కాంగ్రెస్ వ్యూహం. ముఖ్యంగా ఎలక్షన్ అఫిడవిట్లలో వారు చూపించిన ఆస్తులకు, బయట కనిపిస్తున్న విలాసవంతమైన జీవితాలకు పొంతన లేదంటూ కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇది సాధారణ పౌరుల్లో సహజంగానే పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తోంది.

### - పర్యటనలకే కాంగ్రెస్ ఎందుకు ప్రాధాన్యత ఇస్తోంది?

ఇక్కడే ఒక పెద్ద ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలో ఉండి కూడా కేవలం మీడియా పర్యటనలకే పరిమితం కావడం వెనుక అంతరార్థం ఏమిటి? ఇవన్నీ అక్రమాస్తులే అని ప్రభుత్వం గట్టిగా నమ్మినప్పుడు, ఆ వివరాలన్నింటినీ అధికారికంగా బయటపెట్టి, ఏ సంవత్సరంలో కొనుగోలు చేశారు, నిధుల మూలాలు ఏంటి అనే దానిపై సమగ్రమైన విచారణ ఎందుకు జరిపించడం లేదు? ఒక ప్రత్యేక విచారణ కమిటీని లేదా సీఐడీ , విజిలెన్స్ విచారణను ఆదేశిస్తే నిజానిజాలు స్పష్టంగా బయటకు వస్తాయి కదా అనేది ప్రధాన సందేహం. శాసనసభ రికార్డులు, భూ రిజిస్ట్రేషన్ వివరాలు, ల్యాండ్ సీలింగ్, జీవో 111 నిబంధనల ఉల్లంఘనలు వంటి సాంకేతిక ఆధారాలన్నీ ప్రభుత్వ పరిధిలోనే ఉంటాయి. విచారణ చేపడితే అక్రమాలు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకునే లేదా ఆస్తులను జప్తు చేసే అధికారం ప్రభుత్వానికి ఉంది. కానీ, ఆ దిశగా లీగల్ ప్రాసెస్ ప్రారంభించకుండా కేవలం నాయకులు గేట్ల ముందుకు వెళ్లి ప్రెస్ మీట్లు పెట్టడం వల్ల ఇది చట్టపరమైన పోరాటం కంటే రాజకీయ ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తోంది.

### - ఆస్తులన్నీ సక్రమమేనంటున్న బీఆర్ఎస్ నేతలు

మరోవైపు బిఆర్ఎస్ నేతలు ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తమ ఆస్తుల వివరాలన్నీ క్రమం తప్పకుండా ఆదాయపన్ను శాఖ కు, ఎన్నికల కమిషన్‌కు అఫిడవిట్ల రూపంలో సమర్పించామని, అన్నీ పారదర్శకమైనవని వాదిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీల అమలు నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే ఈ ఫామ్‌హౌస్ డ్రామాలు ఆడుతోందని, ధైర్యముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బిఆర్ఎస్ సవాల్ విసురుతోంది. న్యాయపరంగా అక్రమాస్తులను నిరూపించడం సుదీర్ఘమైన ప్రక్రియ. కేవలం ఫామ్‌హౌస్ ఉంది అనగానే అది అక్రమాస్తి అయిపోదు. నిధుల మళ్లింపు లేదా ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగినట్లు నిరూపించాల్సి ఉంటుంది. అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం చట్టపరమైన సంక్లిష్టతల కంటే, ప్రజా కోర్టులో బిఆర్ఎస్ నేతల నైతికతను దెబ్బతీయడానికే ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఏది ఏమైనా, ఆరోపణలు మీడియాకు పరిమితం కాకుండా అధికారిక విచారణల స్థాయికి వెళ్తేనే ఈ ఫామ్‌హౌస్ లొల్లి కి ఒక ముగింపు దొరుకుతుందని తెలంగాణ ప్రజల భావన.

# చైనా చేతిలో అమెరికా ఎఫ్-35 యుద్ధవిమాన విడిభాగాలు!

## - ఇది పొరపాటా? కుట్రా?



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అమెరికా రక్షణ రంగాన్ని, ప్రపంచ భద్రతా వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేసే ఘటన ఒకటి వెలుగులోకి వచ్చింది. అత్యంత ఆధునాతనమైన ఎఫ్-35 స్టెల్త్ యుద్ధ విమానానికి చెందిన కీలకమైన విడిభాగాలు చైనా చేతికి చిక్కాయి. ఆస్ట్రేలియా నుంచి మరమ్మతుల కోసం అమెరికాకు పంపిన ఈ భాగాలు, హాంకాంగ్‌కు దారి మళ్లడంతో అక్కడి అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఇది పొరపాటున జరిగిందా లేక దీని వెనుక ఏదైనా కుట్ర ఉందా అనే దానిపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. వివరాల్లోకి వెళితే, ఆస్ట్రేలియా సైన్యానికి చెందిన ఒక ఎఫ్-35 విమానం కాక్‌పిట్ కెనోపీ, ఆయుధాలను అమర్చే వెపన్స్-బే డోర్‌ను మే నెల చివరలో యూపీఎస్ కొరియర్ ద్వారా అమెరికాకు పంపారు. విమానానికి స్టెల్త్ సామర్థ్యాన్ని అందించే రాడార్-శోషక పూత వీటికి ఉండటమే అత్యంత కీలకమైన విషయం. ఈ షిప్‌మెంట్, దక్షిణ కొరియా మీదుగా ప్రయాణిస్తూ అనూహ్యంగా హాంకాంగ్‌కు చేరింది. ఎందుకు దారి మళ్లిందనే దానిపై స్పష్టత లేదు. హాంకాంగ్‌లో ఈ పార్శిల్స్‌ను చైనా అధికారులు స్వాధీనం చేసుకుని, ఇప్పటివరకు తిరిగి ఇవ్వలేదు.ఈ ఘటనపై అమెరికా రక్షణ కేంద్రం పెంటగాన్ స్పందించింది. పనిచేయని ఎఫ్-35 భాగాల రవాణాలో సమస్య తలెత్తిన విషయం తమ దృష్టికి వచ్చిందని, వాటిని తిరిగి పొందేందుకు, ఘటనపై దర్యాప్తు చేసేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపింది. విమాన తయారీ సంస్థ లాక్‌హీడ్ మార్టిన్ మాత్రం... ఇవి పనిచేయనివని, వీటివల్ల ప్రమాదం తక్కువేనని పేర్కొంది. రవాణా మార్గాన్ని రక్షణ శాఖనే ఎంపిక చేసిందని స్పష్టం చేసింది. అటు ఆస్ట్రేలియా కూడా ఈ ఘటనపై తమ వైపు నుంచి దర్యాప్తు జరుపుతున్నట్లు ప్రకటించింది. అయితే, ఈ విషయంపై చైనా విదేశాంగ శాఖ మాత్రం 'తమకు సమాచారం లేదని' చెప్పడం గమనార్హం. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సమావేశం కోసం యూఎస్ వెళ్లిన తరుణంలోనే ఈ వ్యవహారం బయటకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఖీ-35 టెక్నాలజీని దొంగిలించేందుకు చైనా చాలాకాలంగా గూఢచర్య ప్రయత్నాలు చేస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో ఈ ఘటనకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.నిపుణుల ప్రకారం, ఈ భాగాలు 'పనిచేయనివి' అయినప్పటికీ, వాటిపై ఉన్న స్టెల్త్ పూతను విశ్లేషించడం ద్వారా చైనా తన సొంత టెక్నాలజీని మెరుగుపరుచుకునే ప్రమాదం ఉంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో ఎఫ్-35 విమానాలకు ఆస్ట్రేలియా ఒక ప్రధాన నిర్వహణ కేంద్రంగా ఉన్నందున, ఈ భద్రతా వైఫల్యం తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. యూఎస్ కాంగ్రెస్ కమిటీలు కూడా ఈ అంశంపై సమీక్ష జరుపుతున్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588